మా కలం - సామాన్యుడి బలం
స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక



Dr. DAMA VIJAYKUMAR B.A., LLB
EDITOR
SWARNA SAGARAM TELUGU DAILY
AP State General Secretary
MALAMAHANADU
AP State Joint Secretary
National Consumer Right Commission
Founder & Chairman
Swarna Sagaram Foundation
9440352036
9666038944
vkdvijay09@gmail.com


మా కలం - సామాన్యుడి బలం
# స్వర్ణసాగరం
www.swarnasagaram.in జాతీయ తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ | సంపుటి : 6 | సంచిక : 133 | పేజీలు : 8 | ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్ | శనివారం 10 మే 2025 | వెల : 2-00




# ఉద్రిక్తంగానే..

## కశ్మీరు నుంచి కచ్ వరకూ 20 నగరాలు లక్ష్యంగా..

- నాలుగు రాష్ట్రాల్లో 26 డ్రోన్లు.. కూల్చివేసిన భారత సైన్యం
- డ్రోన్ దాడికి ఫిరోజ్‌పూర్‌లో ముగ్గురికి గాయాలు.. ఒకరు విషమం
- సరిహద్దు ప్రాంతాల్లో రెండో రోజూ సైరన్ మోతలు, చిమ్మ చీకట్లు

2

## జమ్మూ కాశ్మీర్‌లో తెలుగు జవాన్
## మురళీ నాయక్ వీరమరణం

పాక్ కాల్పుల్లో మృతి చెందిన జవాన్ మురళీ నాయక్

మురళీ నాయక్ స్వస్థలం సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితండా

కల్లితండాకు మురళీ నాయక్ పార్థివదేహం

## తప్పుడు ప్రచారాల్లో పాక్ ఆరితేరింది

- పాకిస్థాన్‌లోని నాలుగు గగనతల రక్షణ వ్యవస్థలపై దాడులు చేశా
- ఒక ఏడీ రాడార్ వ్యవస్థను ధ్వంసం చేసినట్లు భారత్ వెల్లడి
- పాక్ తన దుశ్చర్యలను అంగీకరించే బదులు.. భారత్‌పై దుష్ప్రచారం చేస్తోంది



## భారత్ దాడులతో పాక్ బెంబేలు

తెహ్రిక్‌ఇ-తాలిబన్ దాడుల్లో 20 మంది పాక్ సైనికులు హతం

షెహబాజ్ పిరికిపంద అంటూ పాక్ ఎంపీలు ఆగ్రహం

పార్లమెంటులో మాట్లాడుతూ కన్నీళ్లు పెట్టుకున్నఅధికార పార్టీ ఎంపీ

## అమల్లోకి పౌర రక్షణ చట్టం



- అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో పౌర రక్షణ చర్యలను పెంచాలని ఉత్తర్వులు
- అత్యవసర సేకరణ కోసం పౌర రక్షణ నియమాల కింద అత్యవసర అధికారాలను ఉపయోగించాలి
- భారత భూభాగాన్ని రక్షించడానికి అవసరమైన చర్యలను నిర్వహించడానికి అవకాశం కల్పిస్తుంది



## ఆర్మీ చీఫ్‌కు కేంద్రం స్పెషల్ రైట్స్

- అవసరమైతే వారిని కూడా రంగంలోకి!!
- ఆర్మీ చీఫ్‌కు కేంద్రం అధికారాలు
- అవసరమైతే టెరిటోరియల్ ఆర్మీని పిలిపించండని సూచనలు



## తగినంత నిల్వలు అందుబాటులో ఉన్నాయి

- భారత్-పాక్ ఉద్రిక్తతలు.. నిత్యావసర నిల్వలపై కేంద్రం కీలక ప్రకటన!
- దేశంలో కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువుల కొరత లేదు
- కేంద్రం ప్రజలకు హామీ ఇచ్చింది.
- అన్ని నగరాల్లో ఈ వస్తువుల సరఫరాను స్థిరంగా ఉంచడానికి ప్రయత్నిస్తున్నాం

# జూలై 10కి జలాలు

- హంద్రీ-నీవా నీటి విడుదలపై సీఎం ప్రకటన
- పనుల పూర్తికి 3,873 కోట్లు ఖర్చు చేస్తున్నాం
- ఫేజ్-1లో 1.98 లక్షల ఎకరాలకు సాగునీరు
- తర్వాతి దశలో 4.04 లక్షల ఎకరాలకు
- ఈ ప్రాజెక్టుపై గత పాలకుల నిర్లక్ష్యం
- మా ప్రభుత్వం వచ్చాకే పనుల్లో వేగం
- రాష్ట్రమంతటా సంక్షేమ ఫలాలు అందిస్తున్నాం
- పీ-4తో పేదరిక నిర్మూలనకు శ్రీకారం
- ఛాయాపురం ప్రజావేదికలో చంద్రబాబు వెల్లడి



**స్వర్ణసాగరం అనంతపురం**

హంద్రీ-నీవా సుజల స్రవంతి ద్వారా ఈ ఏడాది జూలై 10న నీటిని విడుదల చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఈ పథకం ఫేజ్-1, 2 కింద 554 కిలోమీటర్ల మేర కాలువ విస్తరణ, లైనింగ్ పనులకు రూ. 3,873 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యంతోనే ఐదేళ్లపాటు దీని పనులు ఆగిపోయాయన్నారు. కూటమి అధికారంలోకి రాగానే శరవేగంగా పనులు పూర్తి చేస్తోందన్నారు. శుక్రవారం అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం ఛాయాపురం సమీపంలో హంద్రీ-నీవా కాలువ విస్తరణ, లైనింగ్ పనులను ముఖ్యమంత్రి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆయన వెంట మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, జలవనరుల శాఖ అధికారులు పర్యటించారు. ఏ రోజుకా రోజు పనులు ఏ మేరకు సాగుతున్నాయో డ్రోన్ ద్వారా వివరాలు సేకరించి, ఎప్పటికప్పుడు తెలియజేయాలని సీఎం ఆదేశించారు. త్వరితగతిన పూర్తయ్యేలా శ్రద్ధ పెట్టాలని, జూలై 10 నాటికి నీటి విడుదలకు సమాయత్తం కావాలని స్పష్టంచేశారు. అనంతరం ఛాయాపురంలో ప్రజావేదికలో స్థానికులనుద్దేశించి మాట్లాడారు. హంద్రీ-నీవా, పోలవరం-బనకచర్ల పథకాలు పూర్తయితే రాయలసీమలో కరువు మాటే వినిపించదన్నారు.

- మిగతా3లో

## వారి కోసం దేశమంతా
# ప్రార్థించే సమయమిది

- భారత సైన్యానికి రక్షణగా పవన్ కల్యాణ్ ప్రత్యేక పూజలు
- నరేంద్ర మోదీకి దైవ బలం, ఆశీస్సులు ఉండేలా భగవంతుడిని ప్రార్థించాలని
- శత్రు సేనలను కట్టడి చేసి, దేశాన్ని కాపాడే గొప్ప శక్తిసామర్థ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం మన త్రివిధ దళాలకు మెండుగా ఉన్నాయి



**స్వర్ణసాగరం అమరావతి**

పాకిస్థాన్ మీద భారత బలగాలు చేస్తున్న ఆపరేషన్ సిందూర్ ధర్మ యుద్ధానికి ప్రతి ఒక్కరి నైతిక మద్దతు అవసరమని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. శత్రు మూకలపై పోరాడుతున్న సైన్యానికి, దేశానికి నాయకత్వం వహిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి దైవ బలం, ఆశీస్సులు ఉండేలా

- మిగతా3లో

మా బలం - సామాన్యుడి బలం
RNI No: APTEL/2020/1906
స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక



# ఉద్రిక్తంగానే..



**వరుసగా రెండో రోజూ పాక్ డ్రోన్ దాడులు**

**జమ్మూ, శ్రీనగర్, అమృత్‌సర్,**

భారత్, పాకిస్థాన్ సరిహద్దు ప్రాంతాల్లో వరుసగా రెండో రోజు కూడా ఉద్రిక్త పరిస్థితులే కొనసాగుతున్నాయి. జమ్మూ కశ్మీరు నుంచి గుజరాత్ వరకూ సైరన్ మోతలు వినిపిస్తున్నాయి. రాజస్థాన్‌లోని జైసల్మేర్, జోధ్‌పూర్ సహా జమ్ము నుంచి పంజాబ్ వరకూ చాలా ప్రాంతాల్లో బ్లాకవుట్ కొనసాగుతోంది. ఇళ్లల్లోనూ బయటా లైట్లు ఆర్పేయడంతో చిమ్మ చీకట్లు నెలకొన్నాయి. అదే సమయంలో, పాకిస్థాన్ తన దుర్బుద్ధిని పోనిచ్చుకోలేదు. జమ్మూ కశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్‌ల్లోని 20 నగరాల్లోని సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని శుక్రవారం రాత్రి కూడా పాకిస్థాన్ డ్రోన్ దాడులు చేసింది. మరోసారి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడింది. బారాముల్లా నుంచి భుజ్ వరకూ నాలుగు రాష్ట్రాల్లో 26 డ్రోన్ దాడులు చేసింది. వాటన్నిటినీ భారత్ అడ్డుకుని కూల్చేసింది. వీటిలో శ్రీనగర్ విమానాశ్రయం, దక్షిణ కశ్మీరులోని అవంతిపుర స్థావరమే లక్ష్యంగా చేసిన దాడిని భారత్ సమర్థంగా అడ్డుకుంది. అయితే, అవంతిపుర వైమానిక స్థావరం చుట్టుపక్కల పేలుళ్లు వినిపించాయి. పాకిస్థాన్ డ్రోన్లను గగనతలంలోనే పేల్చేయడంతో బారాముల్లాలో ఆకాశం అరుణ వర్ణాన్ని తలపించింది. జమ్ము కశ్మీరులోని జమ్ము, సాంబ, రాజౌరిబీ పంజాబ్‌లోని పఠాన్‌కోటబీ అమృత్‌సర్, రాజస్థాన్‌లోని పోఖ్రాన్‌ల్లో డ్రోన్ దాడులు జరిగాయి. కుప్వారా, సాంబ, పూంచ్, యురి, నౌగమ్ హంద్వారాల్లో నియంత్రణ రేఖ వెంట భారీగా శతఘ్ని గుళ్ల వర్షం కురిపించింది. అలాగే, జమ్ము, పఠాన్ కోట్‌ల్లో రెండో రోజూ సైరన్లు వినిపించాయి. చిమ్మ చీకట్లు నెలకొన్నాయి. అమృత్‌సర్‌లో భారీగా కాల్పులు జరిగినట్లు తెలిసింది. డ్రోన్లు తిరగడం కనిపించింది. జమ్ము, కశ్మీర్, పఠాన్‌కోట్, ఫిరోజ్‌పూర్, జైసల్మేర్‌ల్లో పేలుళ్లు వినిపించాయి. పంజాబ్‌లోని గురుదాసపూర్, తరణ్ తరణ్ వాసులు కూడా తమకు పేలుళ్లు వినిపించాయని చెప్పారు. వరుసగా రెండో రోజు కూడా జైసల్మేర్‌లో డ్రోన్ దాడులను మన దళాలు అడ్డుకున్నాయి. ఇక, భారీ పేలుళ్లు తనకూ వినిపించాయని జమ్ము కశ్మీరు సీఎం ఒమర్ అబ్దుల్లా తెలిపారు. "అప్పుడప్పుడు భారీగా పేలుళ్ల శబ్దాలు వినిపిస్తున్నాయి. అవి భారీ శతఘ్నులు కావచ్చు. ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నా.. ఎవరూ వీధుల్లో తిరగొద్దు. మరికొన్ని గంటలపాటు ఇళ్లల్లోనే ఉండండి. వదంతులను నమ్మొద్దు" అని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. అలాగే, ఇళ్లల్లో లైట్లను ఆర్పేయాలంటూ మసీదుల్లోని లౌడ్ స్పీకర్ల ద్వారా ప్రకటిస్తున్నారు. మరోవైపు, జమ్ము, సాంబ జిల్లాల్లోని సుచేత్‌గఢ్, రామ్‌గఢ్ సెక్టార్లలో చొరబాట్లకు అనుకూలంగా భారీగా గుళ్ల వర్షం మొదలైంది. ప్రస్తుత పరిస్థితిపై తమలో భయాందోళనలు నెలకొన్నాయని, అయినా, పాకిస్థాన్ కుట్రలను మన సైన్యం తిప్పికొడుతుందన్న భరోసా ఉందని పఠాన్‌కోట్‌లో స్థానికులు చెప్పారు.

**అమృత్‌సర్‌లో లోహ శకలాలు**

అమృత్‌సర్‌లోని జెథువాల్ గ్రామంలో స్థానికులు లోహ శకలాలను గుర్తించారు. అవి క్షిపణి భాగాలుగా అనుమానిస్తున్నారు. స్థానిక పోలీసులు దానిపై సైన్యానికి సమాచారమిచ్చారు. దర్యాప్తు తర్వాతే వివరాలు వెల్లడవుతాయని వారు వివరించారు. అలాగే, కచ్ జిల్లాలోని మారుమూల ఖావ్‌డా గ్రామంలోనూ డ్రోన్ శకలాలను గుర్తించారు. అలాగే, పాకిస్థాన్‌కు చెందిన పలు సైనిక పోస్టులను మన దళాలు ధ్వంసం చేశాయి. సంబంధిత వీడియోను భారత సైన్యం విడుదల చేసింది. రాజస్థాన్ జైసల్మేర్ జిల్లాలోని కిషన్‌ఘాట్ ప్రాంతంలో శుక్రవారం ఉదయం బాంబులా ఉన్నదాన్ని గుర్తించారు. ముందు జాగ్రత్త చర్యగా ఆ ప్రాంతాన్ని దిగ్బంధించారు. ఆర్మీ నుంచి నిపుణులు వచ్చి దానిని పరిశీలిస్తున్నారు.

# జమ్మూ కాశ్మీర్‌లో తెలుగు జవాన్ మురళీ నాయక్ వీరమరణం




**శ్రీనగర్ :** జమ్మూకశ్మీర్‌లో పాకిస్థాన్ జరిపిన కాల్పుల్లో తెలుగు జవాన్ మురళీ నాయక్ అమరుడయ్యారు. వీర జవాన్ స్వస్థలం ఆంధ్రప్రదేశ్ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లి తండా. మే 10 శనివారం వీరజవాన్ పార్థివదేహం స్వగ్రామానికి చేరుకోనుంది. దేశ రక్షణలో శ్రీ సత్యసాయి జిల్లా, పెనుకొండ శాసనసభ నియోజకవర్గం, గోరంట్ల మండలానికి చెందిన మురళి నాయక్ అనే సైనికుడు ప్రాణాలు కోల్పోవడం విషాదకరం. దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుడు మురళి నాయక్ కు నివాళులు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆపరేషన్ సిందూర్ లో భాగంగా కేవలం ఉగ్రవాద స్థావరాలపై మాత్రమే దాడి చేశారు..పాక్ సైనికులకు కానీ, పాక్ పౌరులపై కానీ ఎలాంటి దాడి చేయలేదు. ఉగ్రవాదులకు తమకు సంబంధం లేదన్న పాకిస్తాన్ వక్రబుద్ధిని బయటపెట్టింది. ఉగ్రమూకపై భారత్ దాడి చేస్తే...తిరిగి వంకరబుద్ధి చూపిస్తూ భారత సరిహద్దు ప్రాంతాలపై క్షిపణి, డ్రోన్ దాడులకు పాల్పడుతోంది. ఈ క్రమంలో జమ్మూకశ్మీర్‌లో పాక్ జరిపిన దాడుల్లో తెలుగు జవాన్ వీర మరణం పొందారు. మృతిచెందిన జవాన్‌ను సత్యసాయి జిల్లాకు చెందిన మురళీ నాయక్‌గా గుర్తించారు. మే 08 గురువారం రాత్రి సరిహద్దు వెంబడి పాక్ కాల్పులు జరపగా మన సైన్యం కూడా దీటుగానే బదులిచ్చింది. ఈ ఎదురుకాల్పుల్లో మురళీ నాయక్ చనిపోయినట్టు సమాచారం. మే 10 శనివారం స్వగ్రామానికి వీర జవాన్ పార్థివ దేహం రానుంది. వీర జవాన్ మురళీ నాయక్ సోమందేపల్లి మండలం నాగినాయని చెరువుతండాలో పెరిగారు. సోమందేపల్లి విజ్ఞాన్ స్కూల్‌లో విద్యాభ్యాసం సాగింది. వీర జవాన్ మృతితో ఆయన కుటుంబం శోకసంద్రంలో ఉంది. యుద్ధభూమిలో కన్నుమూసిన మురళీనాయక్ శ్రీరాం నాయక్, జ్యోతీ బాయిల ఏకైక సంతానం

**14 మందిని చంపాడు**

మురళీ నాయక్ తండ్రి శ్రీరాం నాయక్ కొన్ని కీలక విషయాలను చెప్పారు. తన కుమారుడు చనిపోయేముందు పాకిస్థాన్ శత్రువులు దేశంలోకి అడుగుపెట్టకుండా అడ్డుకుని వీరమరణం పొందాడని తెలిపారు. 14మంది శత్రవుల్ని కాల్చి చంపినట్లు స్థానికులతో కలిసి వివరించారు. ఆయన మాటల్లోనే.. 'మురళీ నాయక్ రెండేళ్ల క్రితం ఉద్యోగంలో చేరాడు.. 2022 నవంబర్ 8న అగ్నివీర్ రిక్రూర్ట్‌మెంట్‌లో సెలక్ట్ అయ్యాక ఉద్యోగంలో చేరాడు.. నాలుగేళ్ల అగ్రిమెంట్ ఉంది.. మురళీనాయక్ 2026 నవంబర్‌లో ముగిసేది. ఇవాళ ఆర్మీవాళ్లు నా భార్యకు ఫోన్ చేశారు.. ఆమెకు హిందీ అర్థం కాలేదు. అప్పుడు మురళీ గురించి మాట్లాడుతున్నారని నాకు ఫోన్ తీసుకొచ్చి ఇచ్చింది. రాత్రి ఫైరింగ్ జరిగింది.. మురళీనాయక్ చనిపోయారని నాతో చెప్పారు. కాల్పుల జరిగిన సమయంలో 14మందిని మురళీనాయక్ చంపాడని.. వాళ్లను ఎటాక్ చేసిన తర్వాత వెనక్కు తిరిగి వస్తున్న సమయంలో మురళీని ఎటాక్ చేశారనో నాతో ఆర్మీ వాళ్లు అన్నారు. ఇటీవల మురళీనాయక్‌ను ఆర్మీ పంజాబ్ నుంచి జమ్మూ కాశ్మీర్‌కు తీసుకెళ్లింది' అని వివరించారు. 14మంది శత్రువుల్ని మట్టుబెట్టిన తర్వాత అక్కడ ఎవరూ లేరనుకుని వెనుదిరిగిన సమయంలో ఇదంతా జరిగిందని చెబుతున్నారు. మురళీ నాయక్ మృతి పట్ల ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, పవన్ కళ్యాణ్ తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మురళీ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. శ్రీ మురళీ నాయక్ వీర మరణాన్ని జాతి మరచిపోదన్నారు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. 'ఆపరేషన్ సిందూర్ లో వీర మరణం పొందిన జవాన్ శ్రీ మురళీ నాయక్ గారి త్యాగాన్ని భారత జాతి ఎన్నడూ మరచిపోదు. జమ్ము కశ్మీర్ సరిహద్దుల్లో శత్రు మూకలతో పోరాడి వీర మరణం పొందిన భారత జవాన్ శ్రీ మురళీ నాయక్ గారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. శ్రీ సత్యసాయి జిల్లా కల్లి తండాకు చెందిన ఈ యువ జవాన్ దేశ రక్షణకు అంకితమై, సమర భూమిలో అమరులయ్యారు. ఈ వీరుడి తల్లితండ్రులు శ్రీమతి జ్యోతి బాయి గారికి, శ్రీ శ్రీరామ్ నాయక్ గారికి, ఇతర కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను. రాష్ట్ర ప్రభుత్వ అన్ని విధాలా ఆ కుటుంబానికి భరోసా ఇస్తుంది' అని ప్రకటన విడుదల చేశారు.మురళీ నాయక్ తల్లిదండ్రులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోన్‌లో పరామర్శించారు. దేశ రక్షణలో పెనుకొండ నియోజకవర్గం, గోరంట్ల మండలం, కల్లితండాకు చెందిన మురళినాయక్ ప్రాణాలు కోల్పోవడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మురళీనాయక్ తల్లిదండ్రులు జ్యోతిబాయి, శ్రీరాం నాయక్‌లతో ఫోన్‌లో మాట్లాడి సీఎం వారిని పరామర్శించారు. మాతృభూమి కోసం ప్రాణాలు అర్పించిన మురళీ త్యాగాన్ని దేశమంతా గుర్తుపెట్టుకుంటుందని ముఖ్యమంత్రి అన్నారు. 25 ఏళ్ల వయసులోనే దేశం కోసం అమరుడైన మురళీ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని సిఎం తెలిపారు. వీరజవాన్ మురళీ తల్లిదండ్రుల ఆవేదన తీర్చలేనిది అయినా.. ధైర్యంగా ఉండాలని ముఖ్యమంత్రి వారిని కోరారు.

# అమల్లోకి పౌర రక్షణ చట్టం

**న్యూఢిల్లీ :** పాకిస్తాన్‌తో ఉద్రిక్తతలు పెరుగుతూండటంతో భారత ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. తాజాగా 1968 పౌర రక్షణ చట్టం మరియు నియమాల ప్రకారం అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో పౌర రక్షణ చర్యలను పెంచాలని ఉత్తర్వులు జారీ చేసింది. అత్యవసర సేకరణ కోసం పౌర రక్షణ నియమాల కింద అత్యవసర అధికారాలను ఉపయోగించాలని సూచించింది. ఈ మేరకు హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు లేఖ వెళ్లింది. 1968 పౌర రక్షణ నియమాలలోని సెక్షన్ 11, ఇతర అంశాలతో పాటు శత్రు దాడి జరిగినప్పుడు కీలకమైన సేవల నిర్వహణను నిర్ధారించడానికి అవసరమైన చర్యలు తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఇస్తుంది. 1968లో భారత పార్లమెంటు ఆమోదించిన పౌర రక్షణ చట్టం శత్రు దాడులు లేదా విపత్తుల నుండి పౌరులు, ఆస్తులు, భారత భూభాగాన్ని రక్షించడానికి అవసరమైన చర్యలను నిర్వహించడానికి అవకాశం కల్పిస్తుంది. ఈ చట్టాన్ని మే 24, 1968న ఆమోదించారు. యుద్ధం, బాహ్య దాడి, అంతర్గత అశాంతి, ఇతర శత్రు దాడుల నుండి పౌరులు, ఆస్తులు, భారత భూభాగాన్ని రక్షించడం ఈ చట్టం ఉద్దేశం. బ్లాక్‌అవుట్ చర్యలు, ప్రమాదకర పదార్థాల నిల్వ మరియు ఉపయోగం. వైద్య సహాయం, ఆహార సరఫరా, ఇతర అవసరమైన సేవలు , స్థానిక అధికారులను రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించడం వంటివి ఉన్నాయి. పౌర రక్షణ కార్ప్స్ ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వం ఒక కంట్రోలర్ నియమిస్తుంది. దాడి సమయంలో లైట్లను నియంత్రించడం, అగ్ని ప్రమాదాలను నిరోధించడానికి చర్యలు, జనాభాను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, ఖాళీ చేయించిన వ్యక్తులకు ఆశ్రయం కల్పించడం., శిక్షణ , సన్నద్ధత కోసం అభ్యాసాలు నిర్వహిస్తారు. ఈ అభ్యాసాల సమయంలో ఆస్తి లేదా వ్యక్తుల కు నష్టం జరిగితే, పరిహారం చెల్లిస్తారు. ఈ రెగ్యులేషన్లు కార్ప్స్ సభ్యుల నియామకం, శిక్షణ, విధులను నిర్దేశిస్తాయి. సైనిక బలగాలు, పోలీసు, లేదా ఇతర నిర్దిష్ట సేవలలో లేని వ్యక్తులు సాధారణంగా అర్హులు అవుతున్నారు. ఈనీతీఎ ం ద్వారా దరఖాస్తు చేయాలి. నమోదు సమయంలో ప్రమాణం చేయాలి. విధి నిర్వహణ సమయంలో గాయాలు లేదా ఆస్తి నష్టం జరిగితే, నిర్ణీత పరిహారం చెల్లించబడు తుంది. సభ్యులు కనీసం రెండు వారాల నోటీసుతో రాజీనామా చేయవచ్చు. 1960లలో భారత దేశం బాహ్య దాడుల , అంతర్గత అశాంతుల నేపథ్యంలో, పౌర రక్షణ చర్యలను బలోపేతం చేయడానికి ఈ చట్టం తెచ్చారు. 1970లలో, ఈ చట్టం పౌరులను సమీకరించడంలో విజయవంతమయింది. కార్ప్స్ సభ్యులకు విధి సమయంలో గాయాలు లేదా నష్టం జరిగితే, నిర్దిష్ట నిబంధనల ప్రకారం పరిహారం ఇస్తారు. అయితే చట్ట ఉల్లంఘనకు 3 సంవత్సరాల వరకు జైలు శిక్ష లేదా జరిమానా విధిస్తారు.

# తగినంత నిల్వలు అందుబాటులో ఉన్నాయి

**ఇంటర్నెట్ డెస్క్:** భారత్-పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో దేశ ప్రజల భద్రత కోసం భారత ప్రభుత్వం పలు కీలక చర్యలు తీసుకుంటోంది. ఎటువంటి పరిస్థితులు వచ్చినప్పటికీ.. దేశంలో కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువుల కొరత లేదని.. తగినంత నిల్వలు అందుబాటులో ఉన్నాయని హామీ ఇచ్చింది. పప్పుధాన్యాలు, కూరగాయలు వంటి కీలకమైన ఆహార పదార్థాల ధరలు నియంత్రణలో ఉండేలా నిశితంగా పరిశీలిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అన్ని నగరాల్లో ఈ వస్తువుల సరఫరాను స్థిరంగా ఉంచడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపాయి. ఈ విషయంలో ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం.. రాష్ట్ర ఆహార కార్యదర్శులు, ఇతర కీలక వాటాదారులతో సమావేశాలు నిర్వహిస్తోందని అధికారులు తెలిపారు. నిత్యావసరాల ధరలు పెంచడం, నిల్వలను దాచడం వంటివి నివారించడానికి వ్యాపారులు, సరఫరాదారులపై నిఘా ఉంచాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచనలు చేసినట్లు పేర్కొన్నారు.

**నిత్యావసర సరకుల నిల్వపై చండీగఢ్‌లో నిషేధం**

భారత్-పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న సమయంలో సరిహద్దు జిల్లాల పట్ల కేంద్రం మరింత శ్రద్ధ వహిస్తోంది. ఇందులో భాగంగా చండీగఢ్‌లో నిత్యావసర సరకుల నిల్వపై అధికారులు నిషేధం విధించారు. వ్యాపారులందరూ తమ వద్ద ఉన్న నిల్వల సమాచారాన్ని మూడు రోజుల్లోపు ఆహార, సరఫరాల శాఖకు తెలియజేయాలి ఆదేశాలు జారీ చేశారు. దేశంలో ఉద్రిక్తతలు నెలకొంటున్న సమయంలో ఇదే అదునుగా భావించి కొందరు వ్యాపారులు, సంస్థలు పెట్రోల్, డీజిల్ సహా ఇతర నిత్యావసర వస్తువులను అక్రమంగా నిల్వ చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఈ చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు. సరిహద్దు రాష్ట్రాల ప్రజలు పెద్ద మొత్తంలో నిత్యావసర వస్తువులను నిల్వ చేసుకుంటుండడంపై పంజాబ్ సీఎం భగవంత్ మాన్ స్పందించారు. ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రశాంతంగా ఉండాలని సూచించారు. దేశంలో సరిపడా నిత్యావసరాల లభ్యత ఉందని.. అక్రమ నిల్వలు చేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.

## దెబ్బ మీద దెబ్బ.. భారత్ దాడులతో పాక్ బెంబేలు

పాకిస్థాన్‌కు దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. ఒక్క పక్క భారత ఆర్మీదాడులతో పాక్ బెంబేలెత్తిపోతుండగా.. మరో పక్క బీఎల్ఏ దాడులతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. తెహ్రిక్ఇ-తాలిబన్ దాడుల్లో 20 మంది పాక్ సైనికులు హతమయ్యారు. ఇదిలా ఉండగా, పాక్ ప్రధానిని ఆ దేశ ఎంపీలు టార్గెట్ చేశారు. పాక్ పార్లమెంట్ సాక్షిగా ప్రధాని షెహబాజ్‌పై విమర్శలు గుప్పించారు. షెహబాజ్ పిరికిపంద అంటూ పాక్ ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారత సైన్యం దాడులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న పాకిస్తాన్‌లో సామాన్యులతో పాటు చట్టసభల సభ్యులు కూడా బెంబేలెత్తిపోతున్నారు. సైనిక రిటైర్డ్ మేజర్, సీనియర్ ఎంపీ అయిన తాహిర్ ఇక్బాల్ ఆ దేశ పార్లమెంటులోనే ఏకంగా ఏడ్చేశారు. అధికార పార్టీ ఎంపీ అయిన ఇక్బాల్.. పార్లమెంటులో మాట్లాడుతూ కన్నీళ్లు పెట్టుకున్న వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా, ఇస్లామాబాద్‌లోని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ ఇంటి సమీపంలో భారత్ దాడులకు దిగింది. దీంతో తన నివాసం నుంచి పాక్ ప్రధాని పరారైనట్లు సమాచారం. హెచ్‌క్యూ-9పీ, హెచ్‌క్యూ-9బీఈ, ఎఫ్ డీ- 2000, హెచ్‌క్యూ-16ఎఫ్ఈ గగనతల రక్షణ వ్యవస్థలపై పాక్ ఆధారపడుతోంది. వీటితోపాటే పాతతరం ఎల్‌వై-80, ఎఫ్ఎం-90 రకాలూ ఎంతోకొంత పాక్‌కు సాయపడుతున్నాయి. 40 కిలోమీటర్ల స్థాయిలో లక్ష్యాలను ఛేదించడానికి ఎల్‌వై-80ను పాక్ వాడుతోంది. మే 7వ తేదీ అర్ధరాత్రి దాటాక భారత్ చేసిన దాడిలో హెచ్‌క్యూ-16 వ్యవస్థ నాశనమైంది. చైనా నుంచి 2021లో హెచ్‌క్యూ-9పీ దీర్ఘశ్రేణి గగనతల రక్షణ వ్యవస్థను దిగుమతి చేసుకుంది. తమ గగనతలంలోకి వచ్చిన శత్రు క్షిపణులను 125 కిలోమీటర్ల దూరం నుంచే గుర్తించి నేలమట్టంచేయగలదు. యుద్ధ విమానాలనూ అడ్డుకోగలదు.

## తప్పుడు ప్రచారాల్లో పాక్ ఆరితేరింది



**ఇంటర్నెట్ డెస్క్:** భారత్‌లోని ప్రార్థన స్థలాలనూ పాకిస్థాన్ లక్ష్యంగా చేసుకుంటోందని విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ పేర్కొన్నారు. పాక్ తన దుశ్చర్యలను అంగీకరించే బదులు.. భారత్‌పై దుష్ప్రచారం చేస్తోందన్నారు. ఇటువంటి తప్పుడు ప్రచారాల్లో ఆ దేశం ఆరితేరిందని మండిపడ్డారు. పాకిస్థాన్‌లోని నన్కానా సాహిబ్ గురుద్వారాను భారత్ లక్ష్యంగా చేసుకున్నట్లు తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసిందని, ఇది మరో పచ్చి అబద్ధమని ఖండించారు. మత విద్వేషాలను రెచ్చగొట్టే ఉద్దేశంతో ఈ ఘటనలకు మతపరమైన రంగును పులిమేందుకు దాయాది దేశం యత్నిస్తోందని విమర్శించారు.

**4 గగనతల వ్యవస్థలపై భారత్ దాడి..**

"భారత నగరాలు, పౌర సదుపాయాలు, సైనిక స్థావరాలే లక్ష్యంగా పాకిస్థాన్ గురువారం రాత్రి రెచ్చగొట్టే చర్యలకు దిగింది. బఠిండా సైనిక స్థావరం లక్ష్యంగా డ్రోన్‌లు దూసుకొచ్చాయి. భారత సాయుధ బలగాలు వాటిని తిప్పికొట్టాయి. ఇందులో భాగంగా పాకిస్థాన్‌లోని నాలుగు గగనతల రక్షణ వ్యవస్థలపై దాడులు చేశాం. ఒక ఏడీ రాడార్ వ్యవస్థను భారత డ్రోన్ ధ్వంసం చేసింది. ఈ దాడులను పాకిస్థాన్ అధికార యంత్రాంగం తిరస్కరించడం.. వారి ద్వంద్వ వైఖరిని తెలియజేస్తుంది"

**పాక్ మిలిటరీ పోస్ట్ ధ్వంసం..**

"నియంత్రణ రేఖ వెంట పాఠశాలలు, ప్రార్థనా మందిరాలే లక్ష్యంగా పాక్ దాడులు చేస్తోంది. పూంచ్‌లోని ఓ స్కూల్ సమీపంలోని ఇంటిపై దాడి ఘటనలో ఇద్దరు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. కాల్పుల నేపథ్యంలో పాఠశాల సిబ్బంది సహా అనేకమంది స్కూల్ కింద ఉన్న బంకర్లలో తలదాచుకున్నారు. అదృష్టవశాత్తూ ఆ పాఠశాల మూసివేసి ఉండటంతో భారీ ప్రమాదం తప్పింది. దాయాది మరింత దిగజారిందనడానికి ఈ చర్యలే నిదర్శనం" అని విక్రమ్ మిస్రీ పేర్కొన్నారు. ప్రస్తుత భద్రత పరిస్థితుల దృష్ట్యా కర్తార్‌పుర్ సాహిబ్ కారిడార్ సేవలను తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు నిలిపివేసినట్లు విక్రమ్ మిస్రీ తెలిపారు. నేడు అంతర్జాతీయ ద్రవ్యనిధి (%×వీఖీ%) సమావేశం జరుగుతోందన్న ఆయన.. పాక్‌కు సంబంధించి భారత్ తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తుందన్నారు. తదుపరి నిర్ణయం బోర్డు తీసుకుంటుందని చెప్పారు.

## ఆర్మీ చీఫ్‌కు కేంద్రం స్పెషల్ రైట్స్



పాకిస్థాన్ పన్నాగాలకు చెక్ పెట్టేందుకు భారత ఆర్మీ చీఫ్‌కు కేంద్ర ప్రభుత్వం మరిన్ని అధికారులను కట్టబెట్టింది. డ్రోన్లు, మిస్పైల్స్‌తో దాడులు చేసిన పాకిస్థాన్‌కు భారత్ చుక్కలు చూపించడంతో దాయాది దేశం మరో కుతంత్రానికి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పాక్ ఎత్తులను చిత్తు చేసేందుకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది.

**సిద్ధంగా ఉండాలని సూచన**

అవసరమైతే టెరిటోరియల్ ఆర్మీని రంగంలోకి దించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది కేంద్ర ప్రభుత్వం. టెరిటోరియల్ ఆర్మీలోని అధికారులను, నమోదు చేసుకున్న సిబ్బందిని పిలిచేందుకు ఆర్మీ చీఫ్‌కు అధికారం కల్పించింది కేంద్రం. రెగ్యులర్ ఆర్మీతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలని సూచించింది. అయితే ఇప్పటి వరకు టెరిటోరియల్ ఆర్మీ సిబ్బంది పలు సందర్భాల్లో యుద్ధాల్లో పాల్గొన్నారు. 1962, 1965, 1971ల్లో జరిగిన యుద్ధాల్లో భారత సైన్యంతో కలిసి పనిచేశారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సేవ కార్యక్రమాలు చేశారు. ఇటీవల కేరళలో వరదలు వచ్చిన సేవలు అందించిన మాలీవుడ్ స్టార్ హీరో మోహన్ లాల్ కూడా టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కర్నల్ స్థాయి అధికారే.

**ధోనీ, సచిన్, అనురాగ్**

ఆ జాబితాలో మోహన్ లాల్‌తోపాటు టీమ్ ఇండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ, కాంగ్రెస్ నేత సచిన్ పైలట్, భారత మాజీ దిగ్గజం కపిల్ దేవ్, బీజేపీ నేత అనురాగ్ ఠాకూర్, అథ్లెట్ అభినవ్ బింద్రా సహా పలువురు సెలబ్రిటీలు టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కర్నల్ స్థాయిలో ఉన్నారు. అయితే కనీస అర్హత సర్వీస్ పూర్తి చేసిన వారికి పింఛనుతోపాటు క్యాంటీన్, మెడికల్, ఎల్‌టీ అలవెన్సులు అందిస్తుంది కేంద్ర ప్రభుత్వం.

**దాదాపు 50 వేల మంది!**

టెరిటోరియల్ ఆర్మీ గురించి ఒక్క చెప్పాలంటే సైనిక రిజర్వ్ ఫోర్స్ అని చెప్పవచ్చు. ఇందులోని వారికి అధికారులకు రెగ్యులర్ ఆర్మీ తరహాలోనే శిక్షణ ఉంటుంది. వారంతా బయట తమ పనులు చేసుకుంటూనే వాలంటరీగా సైన్యంతో పనిచేస్తుంటారు. ప్రస్తుతం దాదాపు 50 వేల మంది వరకు అలా ఉన్నట్లు సమాచారం. టెరిటోరియల్ ఆర్మీ అధికారుల్లో పలువురు ఇప్పటికే శౌర్య, విశిష్ఠ పురస్కారాలను కూడా అందుకున్నారు.

# జూలై 10కి జలాలు



-మొదటిపేజీ తరువాయి

**ఇంకా సీఎం ఏమన్నారంటే..**

**రతనాల సీమ చేస్తానని ఆరోజే చెప్పా..**

1996 మార్చి 11న ఉరవకొండ నియోజకవర్గంలో హంద్రీ-నీవాకు శంకుస్థాపన చేశాను. ఈ ప్రాజెక్టు ఎన్టీఆర్ కల. మిగులు జలాలు వాడుకోవడానికి ఆయన హంద్రీ-నీవా, గాలేరు-నగరి, తెలుగుగంగ ప్రాజెక్టులకు రూపకల్పన చేసి, రాయలసీమ దశ-దిశ మార్చారు. నేను సీఎం అయ్యాక సీమ ఎడారిగా మారకుండా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాం. రాయలసీమను రతనాల సీమగా చేస్తానని ఆరోజే చెప్పాను. రా కదలిరా కార్యక్రమంలో భాగంగా ఉరవకొండకు వచ్చాను. ఉమ్మడి జిల్లాలో 14 సీట్లూ ఇవ్వండి.. నా మీద నమ్మకం పెట్టండని కోరాను. 14 సీట్లతోపాటు రెండు ఎంపీ సీట్లను కూడా ఇచ్చారు. హంద్రీ-నీవాను వెడల్పు చేస్తానని చెప్పాను. చెప్పిన గంటలోనే జీవో జారీ చేశాను. ఇప్పటికి 37 శాతం పనులు పూర్తి చేశాం. ప్రాజెక్టు పూర్తయితే సీమలో ఫేజ్-1లో 1.98 లక్షలు, ఫేజ్-2లో 4.04 లక్షల ఎకరాలకు నీరందుతుంది. ఎన్నికలొస్తే పక్కచూపులు..: ఇప్పుడు మీరంతా బాగుంటారు. ఎన్నికలొస్తే కొందరు పక్క చూపులు చూస్తారు. ఆ పక్క చూపుల వల్ల రాష్ట్రం ఇబ్బందుల్లో పడింది. నాలో తప్పుందా.. మీలో తప్పుందా అని ఆలోచిస్తూ ఉంటాను. హైదరాబాద్‌ను 9 సంవత్సరాల్లో అభివృద్ధి చేశాం. అయినా 2004లో ఎన్నికల్లో ఓడిపోయాం. 2014లో రాష్ట్రం విడిపోయి కష్టాల్లో ఉన్నా హంద్రీ-నీవా సహా అన్నీ ముందుకు తీసుకెళ్లాం. గొల్లపల్లి ప్రాజెక్టు పూర్తి చేసి, నీళ్లు చూపించి, కియా కంపెనీని జిల్లాకు తీసుకొచ్చాం. కరువు జిల్లా నుంచి ప్రపంచానికి కియా కార్లు వెళ్తున్నాయంటే అదీ టీడీపీ సత్తా. అలాంటి చరిత్ర సృష్టిస్తే మీరు 2019లో జిల్లాలో టీడీపీకి రెండే సీట్లు ఇచ్చారు. దాంతో వెనక్కి వెళ్లాం. జగన్ ఐదేళ్లలో హంద్రీ-నీవా కోసం ఒక్క రూపాయి ఖర్చు పెట్టారా..? ఏ రోడ్డుకైనా మట్టి వేశారా..? గుంతలు పూడ్చారా..? కాలువల్లో గంప మట్టి తీశారా? (లేదని జనం నినదించారు) ఇప్పుడు రూ.3,873 కోట్లు మంజూరు చేసి పనులు చేస్తున్నాం. కాలువను 16.05 మీటర్లకు వెడల్పు చేస్తున్నాం. ఇప్పుడు ప్రారంభించిన పనులన్నీ ఈ సీజన్‌లోనే పూర్తి చేస్తాం. 40 టీఎంసీల నీళ్లు తీసుకొస్తాం. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి కుప్పం వరకు హంద్రీ-నీవా కాలువ 773 కిలోమీటర్ల పొడవు ఉంది. ఆసియాలోనే ఎక్కువ పొడవైన కాలువ. ఈ సంవత్సరం వర్షాలు బాగా పడ్డాయి. సీమలోని అన్ని రిజర్వాయర్లు, చెరువుల్లో నీరు నింపాం. అవసరమైతే చిన్న చిన్న లిఫ్టులు పెట్టి ఉమ్మడి జిల్లాలోని అన్ని చెరువులకు నీళ్లు ఇచ్చే బాధ్యత నాది. గోదావరి నుంచి ఏటా 2 వేల టీఎంసీలు సముద్రంలో కలిసిపోతున్నాయి. అందులో 300 టీఎంసీలు తెచ్చుకోగలిగితే రాష్ట్రం మొత్తం సస్యశ్యామలమైపోతుంది. పోలవరం నుంచి బనకచర్లకు నీరు తేవాలంటే రూ.81 వేల కోట్లు కావాలి. సుసాధ్యం చేసే సంకల్పంతో ముందుకెళ్తున్నాం

**దేశంలో ఎక్కడా లేనంతగా..**

గత 11 నెలల్లో దేశంలో ఎక్కడా చేయని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. 63 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నాం. దీపం-2 కింద ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. అన్న క్యాంటీన్ల ద్వారా రూ.5కే అన్నం పెడుతున్నాం. 16,500 పోస్టులతో మెగా డీఎస్సీ విడుదల చేశాం. అన్నదాతకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తాం. కేంద్రం ఇచ్చిన తేదీనే రాష్ట్రం తరపున రూ.14 వేలు 3 విడతల్లో జమ చేస్తాం. తల్లికి వందనం కింద ఎంత మంది పిల్లలుంటే అంత మందికీ డబ్బులిస్తాం.

**గతంలో ఎక్కడ చూసినా గుంతల రోడ్లే..**

గతంలో ఎక్కడ చూసినా రోడ్లన్నీ గుంతలే. ఇప్పుడు బాగుపడ్డాయా.. లేదా? (బాగున్నాయంటూ ప్రజలు చేతులెత్తి సమాధానం చెప్పారు). ఈ రోడ్లు ఇంకా బాగుపడాలి. సంపద సృష్టి జరగాలి. ఆదాయం పెరగాలి. పేదరికం నుంచి అందరినీ పైకి తీసుకురావాలి. నేను సాధారణ కుటుంబంలో పుట్టాను. మా నాన్నా రైతే. గాంధీజీ, అంబేద్కర్, అబ్దుల్ కలాం, ఎన్టీఆర్, మోదీ.. వీరంతా సామాన్య వ్యక్తులే. అంబేద్కర్‌కు బరోడా రాజు అండగా నిలబడ్డారు. ఆయనిచ్చిన డబ్బులతో లండన్‌లో చదువుకుని రాజ్యాంగం రచించారు. అబ్దుల్ కలాంకు అయ్యంగార్ అండగా నిలబడ్డారు. నేనూ అదే చేస్తున్నా. పైనున్న 10 శాతం మంది.. కింది స్థాయిలో ఉన్న 20 శాతం మందిని దత్తతకు తీసుకుని, ఆదుకోవాలి. 2029 నాటికి పీ-4తో పేదరికం లేని సమాజాన్ని తయారు చేయడమే లక్ష్యం.

# ఇక సీరియస్ యాక్షన్



**విజయవాడ :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ నేడు తరచూ ఒకే మాట చెబుతున్నారు. తాను మారానని అంటున్నారు. అంటే గతంలో తాను చేసిన తప్పులేమిటో ఆయన అర్థం చేసుకునట్లే ఉంది. ఎందుకంటే మారానంటూ ఆయన ఏ నేతలతో సమావేశమైనా ఇదేరకమైన వ్యాఖ్యలు చేస్తున్నారు. నేతలకు దూరంగా ఉండటం, కార్యకర్తలతో టచ్ మీ నాట్ అంటూ వ్యవహరించడంతో పాటు ప్రజలకు కూడా దూరమై కేవలం తాడేపల్లి లోని క్యాంప్ కార్యాలయానికే ఆయన అధికారంలో ఉన్న ఐదేళ్ల పాటు పనిచేశారు. అప్పుడు ఎవరి మాట చెవికెక్కించుకోలేదు. అధికారులను చుట్టూపెట్టుకుని వారు ఆడినట్లే ఆడారు. దాని ఫలితంగానే దారుణమైన ఓటమిని చవి చూడాల్సి వచ్చింది.దీంతో పాటు చుట్టూ కోటరీ కూడా జగన్ ఓటమికి కారణమయింది. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులు జగన్ దృష్టికి వారు తీసుకెళ్లలేదు. అంతేకాదు.. జగన్ ఏం చెప్పినా దానికి ఊ కొట్టడమే తప్పించి అలా కాదు.. ఇలా చేస్తే బాగుంటుందన్న సలహాలు, సూచనలు చేసిన వారు కూడా లేరు. అసలు జగన్ వింటారని అనుకోలేం కానీ కానీ కనీసం ఆ ప్రయత్నం చేసిన నేతలు కూడా లేరు. అధికారంలో ఉన్నప్పుడు ఆ వ్యవహారం నడిచింది. అయితే అధికారం కోల్పోయిన తర్వాత తాను ఏం తప్పులు చేశారో ఇప్పుడు అర్థమవుతుంది. తాను తీసుకున్న నిర్ణయాలతో ఎంత మంది బాధపడ్డారు.. తన విజయం కోసం పనిచేసిన వారే ఆర్థికంగా నష్టపోయారన్న విషయం జగన్ కు ఇప్పటి కాని తెలిసి రాలేదుదీంతో రాష్ట్రంలో సంక్షేమ పథకాలను భారీ స్థాయిలో అమలు చేసినా ప్రజలు గెలిపించకపోవడానికి అనేక కారణాలున్నాయి. నలభై శాతం ఓట్లు వచ్చాయని, మూడు పార్టీలు కలవడంతోనే కూటమి గెలిచిందని నచ్చ చెప్పుకున్నప్పటికీ నాడు తాను చేసిన పనుల కారణంగానే పది శాతం ఓట్లు పూర్తిగా దూరమయ్యాయన్నది అర్థమయింది. ప్రధానంగా మధ్యతరగతి, కొన్ని సామాజికవర్గాల వారిని జగన్ కావాలని దూరం చేసుకున్నారు. ఇక అనేక చోట్ల వైసీపీ ఎమ్మెల్యేలు, కొందరు నేతలు భూ కబ్జాలకు పాల్పడుతున్నా పట్టించుకోలేదు. ఒకటి రెండు ఫిర్యాదులు వచ్చినా భూ కబ్జాలు చేసిన వారిని వెనకేసుకు వచ్చారు. దీంతో తమఆస్తులకు రక్షణ లేకుండా పోయిందన్న అభద్రత నెలకొంది.మరొక వైపు వాలంటీర్లు దారుణంగా పార్టీని దెబ్బతీశారు. తాజాగా మాజీ మంత్రి గుడివాడ అమర్ నాథ్ కూడా వాలంటీర్ల వల్లనే తాము ఓడిపోయామని చెప్పారంటే జగన్ కు అర్థం కాకుండా ఉంటుందా? వాలంటీర్లే అన్నీ పనులు చేస్తుంటే కార్యకర్తలతో ప్రజలకు పనిలేకుండా పోయింది. ఎమ్మెల్యేలు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారు. దీంతో మరొకసారి తాను గెలుద్దామని అనుకుంటే.. వాలంటీర్లు కూడా ఎన్నికల్లో సహకరించకుండా ఎన్నికల కమిషన్ ఆంక్షలు విధించింది. దీంతో ఓటర్లు చంద్రబాబు ఇచ్చిన హామీలకు అటు వెళ్లిపోయారు. ఇప్పుడు జగన్ మారారంటున్నారు. అధికారంలోకి వస్తే తాను కార్యకర్తలకు పెద్దపీట వేస్తానని చెబుతున్నారు. వారికి ప్రాధాన్యత ఇస్తానని అంటున్నారు. అదే సమయంలో తనను నమ్ముకున్న వారికి అన్యాయం చేయనని పదే పదే చెబుతున్నారు. మరి ఏం జరుగుతుందన్నది భవిష్యత్ సమాధానం చెప్పాల్సి ఉంటుంది.

# మద్యం స్కాం... అందరూ ఇరుక్కున్నట్టేనా

**గుంటూరు :** ఏపీ మద్యం కుంభకోణంలోకీలక పరిణామం. ఇప్పటికే వైసీపీ ప్రభుత్వంలో మద్యం కుంభకోణం జరిగినట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ తేల్చింది. రూ.3200 కోట్ల లిక్కర్ స్కాం జరిగినట్లు నిర్ధారించింది. కీలక అరెస్టులను సైతం పూర్తి చేసింది. త్వరలో ఎలక వ్యక్తిని అరెస్టు చేస్తారని ప్రచారం జరిగింది. ఇలాంటి సమయంలో ఓ ఆసక్తికర అంశం వెలుగులోకి వచ్చింది. మనీలాండరింగ్ చట్టం కింద దర్యాప్తు చేసేందుకు ఎన్ఫోర్స్మెంట్ డైరెక్ట్ సిద్ధమవుతోంది. ఇప్పటివరకు జరిగిన విచారణలో తేలిన అంశాలు, ఆధారాలు తమకు ఇవ్వాలంటూ సిట్ ను ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ కోరినట్లు తెలుస్తోంది.విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటైన సంగతి తెలిసిందే. గత కొద్దిరోజులుగా మద్యం కుంభకోణానికి సంబంధించి సమగ్ర దర్యాప్తు ఈ బృందం చేస్తోంది. ముఖ్యంగా రాజ్ కసిరెడ్డి అరెస్టు తర్వాత ఈ మొత్తం కుంభకోణం పై ఒక నిర్ధారణకు వచ్చింది ప్రత్యేక దర్యాప్తు బృందం. ఈ తరుణంలో ఈడి ఎంట్రీ ఇచ్చింది. మొత్తం వివరాలను తమకు ఇవ్వాలని ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ కోరినట్లు తెలుస్తోంది. సిట్ అధిపతిగా ఉన్న విజయవాడ కమిషనర్ కు లేఖ రాసినట్లు సమాచారం. దీంతో త్వరలో ఈ వివరాలను ఈడితో కూడా పంచుకునేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ సిద్ధమవుతోంది. సిట్ నుంచి వివరాలు రాగానే ఈడి ఈ కేసును మనీ లాండరింగ్ చట్టం కింద నమోదు చేసి దర్యాప్తు చేయనుంది.కూటమి( అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం కుంభకోణం ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. సిఐడి దర్యాప్తు చేసింది. ప్రాథమిక వివరాలను వెల్లడించింది. అయితే సిఐడి



దర్యాప్తు ఒక్కటే చాలదని.. ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ కూడా అవసరమని భావించి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మొత్తం ప్రాథమిక అంశాలతో పాటు లోతైన విచారణ జరిగింది. ఈ నేపథ్యంలోనే ఈడి ఎంట్రీ ఇచ్చింది. నమోదు చేసిన ఎఫ్ఐఆర్ తో పాటు సీజ్ చేసిన బ్యాంక్ ఖాతాల వివరాలు కూడా కోరినట్లు తెలుస్తోంది. ఇప్పటికే సూత్రధారిగా భావిస్తున్న రాజ్ కసిరెడ్డి, ఆయన అనుచరుడు మహిళా దిలీప్ కూడా అరెస్టు అయ్యారు. వీరితోపాటు మాజీ సీఎం జగన్కు కార్యదర్శిగా పనిచేసిన ధనుంజయ రెడ్డి, ఓ ఎస్ బీ గా పని చేసిన కృష్ణమోహన్ రెడ్డి, మరో నిందితుడు గోవిందప్ప అరెస్టుకు రంగం సిద్ధమవుతోంది. వీరికి ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించడంతో అరెస్టు చేసేందుకు సిట్ గాలిస్తోంది.వాస్తవానికి కూటమి ప్రభుత్వం పక్కా ఆధారాలతో వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో మద్యం కుంభకోణం జరిగినట్లు గుర్తించింది. కీలక నేత హస్తం ఉందని అనుమానిస్తోంది. పార్లమెంటులో టిడిపి పక్ష నేత లావు శ్రీకృష్ణదేవరాయలు ఈ అంశంపైనే మాట్లాడారు. అటు తరువాత కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షాను కలిసి కీలక ఆధారాలు చూపించారు. అప్పటినుంచి మద్యం కుంభకోణం వేగవంతం అయ్యింది. సిట్ దూకుడుగా అడుగులు వేస్తోంది. అరెస్టులు సైతం కొనసాగాయి. ఇప్పుడు మనీ లాండరింగ్ కింద ఈడి ఎంటర్ కావడంతో.. కేసు మరింత బిగుసుకునే పరిస్థితి ఉంది.

## వారి కోసం దేశమంతా ప్రార్థించే సమయమిది

-మొదటిపేజీ తరువాయి

భగవంతుడిని ప్రార్థించాలని అన్నారు. శత్రు సేనలను కట్టడి చేసి, దేశాన్ని కాపాడే గొప్ప శక్తిసామర్థ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం మన త్రివిధ దళాలకు మెండుగా ఉన్నాయని చెప్పారు. వారి కోసం దేశమంతా ప్రార్థించే సమయమిదని పవన్ కల్యాణ్ అన్నారు. ఇవాళ(శుక్రవారం) ఈ మేరకు పవన్ కల్యాణ్ ఓ ప్రకటన విడుదల చేశారు. జనసేన పక్షాన మంగళవారం ఉదయం షష్ట షణ్ముఖ క్షేత్రాలైన తిరుత్తణి, తిరుచెందూరు, పళని, తిరుపరంకుంద్రమ్, స్వామిమలై, పలముదిరచోళై క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు చేయించాలని నిర్ణయించామని పవన్ కల్యాణ్ అన్నారు. ఇందులో భాగంగా ప్రతి క్షేత్రానికి ఒక శాసన సభ్యుడు, జన సైనికులను పంపించి పూజలు చేయిస్తామని చెప్పారు. కర్ణాటకలోని కుక్కే, ఘాటీ సుబ్రహ్మణ్య క్షేత్రాలు, ఆంధ్రప్రదేశ్‌లోని మోపిదేవి, బిక్కవోలులోని సుబ్రహ్మణ్య ఆలయాలు, ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర ఆలయం, పిఠాపురం శ్రీ పురూహూతిక దేవి ఆలయాల్లో పూజలు చేయిస్తున్నట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ ఆదివారం శ్రీకాకుళం జిల్లా అరసవల్లిలోని శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో సైన్యానికి సూర్య శక్తి తోడుండేలా పూజలు చేస్తునట్లు పవన్ కల్యాణ్ వెల్లడించారు. వీటితోపాటు రాష్ట్రంలోని వివిధ క్షేత్రాల్లోనూ సైన్యం కోసం, యుద్ధ ప్రభావం ఉన్న జమ్ము, కశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్, హరియాణ రాష్ట్రాల ప్రజల క్షేమాన్ని కోరుతూ పూజలు చేయాలని అన్నారు. క్రైస్తవ ధర్మాన్ని విశ్వసించేవారు చర్చిల్లో, ఇస్లాం ధర్మాన్ని ఆచరించేవారు మసీదుల్లో ప్రార్థనలు చేపడతారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## జనాలకు దూరంగా మంత్రులు

**నెల్లూరు :** కేవలం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రమే యాక్టివ్ గా ఉంటే సరిపోదు. మంత్రివర్గంలోని అందరు సభ్యులు సమిష్టిగా అడుగులు వేస్తేనే కూటమి ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లో గట్టెక్కుతుంది. వన్ మ్యాన్ షో ఇప్పుడు పనికి రాదు. గత ప్రభుత్వంలో జరిగిన లోటు పాట్లు ఈ ప్రభుత్వంలో కంటిన్యూ అవుతున్నాయి. చంద్రబాబు నాయుడు ఏ జిల్లాకు వెళ్లినా అక్కడ పార్టీ నేతలు, కార్యకర్తలతో మాత్రం ఖచ్చితంగా సమావేశమవుతున్నారు. కానీ మంత్రులకు మాత్రం తీరిక లేదు. రిబ్బన్ కట్ చేసి జిల్లాల నుంచి వెనుదిరిగి వస్తున్నారు. దీంతో చంద్రబాబు మంత్రుల విషయంలో గత కొన్ని నెలలు చేస్తున్న హెచ్చరికలు కూడా పనిచేయడం లేదన్నది తెలుగుదేశం పార్టీ లో వినిపిస్తున్న టాక్.అనేక జిల్లాల్లో టీడీపీ నేతల మధ్య వైరం తారా స్థాయికి చేరుకుంది. ఒకరంటే ఒకరికి పడటం లేదు. ఎమ్మెల్యేలు కూడా ముఖ్యనేతలను, కార్యకర్తలను కలుపుకుని వెళ్లడం లేదు. ఇసుక, మద్యం వంటి వ్యాపారాల్లో కొందరు ఎమ్మెల్యేలు ఉండి పార్టీ నేతలను, కార్యకర్తలను పట్టించుకోవడం లేదు. ఈ విషయంపై పార్టీ కేంద్ర నాయకత్వానికి అనేక ఫిర్యాదులు అందుతున్నాయి. అనేక చోట్ల గ్రూపులుగా విడిపోయి పార్టీ పిలుపు నిచ్చిన కార్యక్రమాలు కూడా వేర్వేరుగా జరుపుకుంటున్నారు. ఈ విషయం మంత్రుల దృష్టికి వచ్చినా పట్టించుకోవడం లేదు. జిల్లా ఇన్ ఛార్జి మంత్రులు కానీ, ఆ జిల్లాకు చెందిన మంత్రులు కానీ తమకెందుకు వచ్చిందన్న ధోరణిలో ఉన్నారుమరొకవైపు కూటమి నేతల మధ్య కూడా సయోధ్య లేదు. అనేక జిల్లాల్లో విడివిడిగానే పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఎవరి జెండా వారిదే. ఎవరి అజెండా వారిదే. ఈ విషయంలోనూ మంత్రలు పట్టించుకోవడం లేదు. చంద్రబాబు పార్టీ అధినేతగా చిన్న చిన్న విషయాలను సర్దు చాటు చేసే సమయం ఉండదు. వాటిని మంత్రులు దగ్గరుండి సమయం వెచ్చించి కూర్చుని మనసు పెట్టి పని చేస్తే చాలా వరకూ విభేదాలు సమసిపోతాయి. చిన్న చిన్న సమస్యలే అయినా వాటిని పరిష్కరించే వారు లేక మరింత తీవ్రమై గ్యాప్ పెరిగి పార్టీకి నష్టం చేకూర్చే విధంగా తయారవుతున్నాయి. ఈ ప్రభావం వచ్చే ఎన్నికల్లో ఖచ్చితంగా ఉండే అవకాశముంది.మంత్రులకు ఫ్రీ హ్యాండ్ లేదా? అంటే దానికి పార్టీ నాయకత్వం నుంచి ఒకటే సమాధానం వస్తుంది. అసలు సమస్యపై దృష్టి పెడితే కదా? అది తీవ్రమైనదా? లేదా చిన్న సమస్య అని తెలిసేది అని సీనియర్ నేత ఒకరు వ్యాఖ్యానించారు. అసలు ప్రయత్నించకపోవడమే ఈ పరిస్థితికి కారణమని అంటున్నారు. గతంలోనూ వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు నియోజకవర్గాలలో పార్టీ నేతల మధ్య నెలకొన్న విభేదాలే మొన్నటి ఎన్నికల్లో ఆ పార్టీ కొంప ముంచాయి. ఇప్పుడు అదే పరిస్థితి టీడీపీలోనూ ఉంది. అందుకే మంత్రి వర్గ సమావేశంలో చంద్రబాబు ఈ విషయంలో మంత్రులకు క్లాస్ పీకారని చెబుతున్నారు. ఏదైనా పెద్ద సమస్య ఉంటే తన వద్దకు తేవాలని, చిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని చెబుతున్నా మంత్రులు చెవికి ఎక్కించుకోవడం లేదు.

### అసాంఘిక కార్యకలాపలకు అడ్డాగా

## వాకాడు సబ్ స్టేషన్



**ప్రైవేటు వ్యక్తులతో ముచ్చట్లు**

**అక్కడే వంట వార్పు, మందు చిందు**

**పవర్ కట్ పై నిర్లక్ష్యపు సమాధానం**

**షిఫ్ట్ ఆపరేటర్ల ఇస్తానుసారంగా విధులు**

**ఇది వాకాడు సబ్టేషన్ పరిస్థితి**

**వాకాడు సబ్ స్టేషన్‌లో కొందరు ఉద్యోగులు సబ్ స్టేషన్ ప్రాంగణాన్ని అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చేస్తున్నారు. ఎనిమిది గంటల పని విధాన నిబంధనలను తుంగలో తొక్కుతూ రోజువారి ఒకరే డ్యూటీలు చేస్తూ ఇస్తానుసారంగా విధులు నిర్వహిస్తున్నారు. వారిలో కొందరు అక్కడే వంటావార్పు చేసుకుని ప్రైవేటు వ్యక్తులతో కార్యాలయంలో ముచ్చట్లు పెట్టుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. అడిగినవారికి నిర్లక్ష్యకు సమాధానం చెబుతూ ఉండటం ఇక్కడ కొందరు షిఫ్ట్ ఆపరేటర్లకు ఆనవాయితీగా మారింది. అందుకు శుక్రవారం సబ్ స్టేషన్ లో జరిగిన ఓ సంఘటన సాక్ష్యంగా నిలుస్తోంది.**

స్వర్ణసాగరం, వాకాడు :

సబ్‌స్టేషన్ పక్కనే ఉన్న ఎన్‌జేఆర్ ( రెడ్డిగారి దిబ్బ గిరిజన ) కాలనీలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ వద్ద షార్ట్ సర్క్యూట్ ఏర్పడి ఉదయం 11:50 నిమిషాల సమయంలో ఆ కాలనీ మొత్తం విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మండల హెడ్ క్వార్టర్ కావడం, మధ్యాహ్నం 1 గంట అయినప్పటికీ ఆ కాలనీకి విద్యుత్ సౌకర్యాన్ని పునరుద్ధంచలేదు. ఈ విషయమై కాలనీవాసులు లైన్‌మెన్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించేందుకు ప్రయత్నించగాఫోన్ అందుబాటులో లేకపోవడంతో పక్కనే ఉన్న సబ్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న షిఫ్ట్ ఆపరేటర్ శివకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఎవరు పట్టించుకోలేదు. కాసేపటి తర్వాత మళ్లీ సబ్ స్టేషన్‌కు ఫోన్ చేసి అడగగా సబ్ స్టేషన్‌లో కరెంటు ఉంది. మీ కాలనీలో ఎందుకు లేదో నాకు తెలియదు అని చెప్పారు. లైన్ మెన్‌కు సమాచారం ఇవ్వమని షిఫ్ట్ ఆపరేటర్ శివను కాలనీ వాసులు అడగగా లైన్మెన్ తో చెప్పాల్సిన పని నాకు లేదు. సబ్‌స్టేషన్‌లో కరెంటు ఉందా లేదా అన్నది మాత్రమే నా డ్యూటీ, ఏదైనా ఉంటే ఏఈ, ఏడితో మాట్లాడుకోమని బదిలివ్వడం ఆశ్చర్యానికి గురిచేసింది. అయితే అప్పటికే అతను కొందరు ప్రైవేటు వ్యక్తులతో కలిసి కార్యాలయంలో వంట వార్పు చేస్తూ ముచ్చట్లు ఆడుకుంటూ సమస్యను తెలిపిన కాలనీవాసులకు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం మే కాకా, నేను ఇలానే మాట్లాడుతాను 20 సంవత్సరాల నుంచి ఇక్కడే ఉద్యోగం చేస్తున్న ఏం చేసుకుంటారో చేసుకోండి అంటూ దురుసుగా సమాధానం చెప్పారు. అయితే శివ విధుల్లో ఉన్నప్పుడు అనేకమార్లు ప్రైవేటు వ్యక్తులను సబ్ స్టేషన్ లోకి పిలిపించుకుని రాత్రి వేళల్లో మద్య సేవించడం, గొడవలు వేసుకున్న సంఘటనలు కూడా ఎన్నో ఉన్నాయి. ఇక్కడ ఉన్న నలుగురు షిఫ్ట్ ఆపరేటర్లు ఒక్కొక్కరు 8 గంటల చొప్పున విధులు నిర్వహించాలి. కానీ ఆ నిబంధనలను తుంగలో తొక్కుతూ, ఒక్కొక్కరు 24 గంటలు చొప్పున విధులు నిర్వహించి మూడు రోజులకు ఒకసారి మాత్రమే సబ్ స్టేషన్కు హాజరవుతున్నారు. దీంతో ఇక్కడే వారు భోజనానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేసుకొని వారికి నచ్చిన వంటకాలు చేసుకుంటూ కొందరు షిఫ్ట్ ఆపరేటర్లు ప్రైవేట్ వ్యక్తులతో కలిసి సబ్ స్టేషన్‌ను అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మార్చేస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి సబ్‌స్టేషన్‌లో జరుగుతున్న పరిస్థితులను పరిశీలన చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

# కిషోర్ బాలికలకు కిషోర్ కిషోర్ వికాసం పై అవగాహన కార్యక్రమం





స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్

శ్రీకాళహస్తి రూరల్ మండలం ఎల్లంపల్లి గిరిజన కాలనీ జగ్గరాజు పల్లి అంగన్వాడీ కేంద్రాల్లో కిషోర్ బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు ప్రభుత్వ ఆదేశాల మేరకు కిషోర్ వికాసం సమ్మర్ స్పెషల్ వేసవి శిక్షణ శిబిరం కార్యాచరణ క్యాలెండర్ ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో యుక్త వయసు గల కౌమార దశలో ఉన్న బాలికలకు ప్రత్యేక శిక్షణ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు ఈ కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపర్వైజర్ మంజుల మాట్లాడుతూ కౌమార దశలో యుక్త వయసు గల పిల్లలు అంగనవాడి పరిధిలోని గ్రామంలోని వారిని గుర్తించి శారీరక మార్పులు మానసిక వికాసం గురించి వివరించారు మహిళా సంక్షేమ కార్యదర్శి లు గీతా మాధురి రేణుక మాట్లాడుతూ యుక్త వయసు గల అమ్మాయిలు ఆత్మ సంరక్షణ కొరకు తీసుకోవలసిన జాగ్రత్తలు సైబర్ నేరాలు సెల్ఫోన్ ద్వారా అపరిచిత వ్యక్తులతో సంభాషణలు చేయకూడదని అందువల్ల ఏర్పడే దుష్పరిణామాలు వివరించారు ప్రగతి స్వచ్ఛంద సంస్థ శ్రీకాళహస్తి మండల కోఆర్డినేటర్ చంద్రశేఖర్ బాల కార్మికుల వ్యవస్థ బాలల అక్రమ రవాణా సమస్యలపై వివరించారు ఆరోగ్య సిబ్బంది చిత్ర ప్రదర్శన ద్వారా కౌమారదశలో ఏర్పడే శారీరిక మార్పులు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు ఈ కార్యక్రమంలో అంగనవాడి టీచర్లు పోలమ్మ బుజ్జమ్మ ఆరోగ్య సిబ్బంది ఆశ వర్కర్లు కిషోర్ బాలికలు పాల్గొన్నారు

# కోవూరు మండలం గంగవరంలో ఘనంగా వివాహ వేడుక..





కోవూరు, స్వర్ణ సాగరం, మే 9 :కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గిరిజన కాలనీలో ఇండ్ల చెంచు రామయ్య కుమారుడు ఇండ్ల రోహిత్ వివాహ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు తెలుగుదేశం పార్టీ నాయకులు గూటూరు శ్రీధర్ నాయుడు, మరికొందరు తెలుగుదేశం పార్టీ నాయకులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

ముఖ్యంగా, గుటూరు శ్రీధర్ నాయుడు నవ దంపతులకు మంగళసూత్రాన్ని అందజేశారు.గ్రామంలోని పలు వివాహాలకు గుటూరు కుటుంబం మంగళసూత్రాలను అందజేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా గూటూరు శ్రీధర్ నాయుడు మాట్లాడుతూ, తమ పెద్దల అభీష్టం మేరకు వివాహాలకు మంగళసూత్రాలు అందజేయడం తమకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందని అన్నారు. వధూవరులు సుఖ సంతోషాలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ వివాహ వేడుక గ్రామంలో సందడి వాతావరణాన్ని నెలకొల్పింది.

# జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించడం మానుకోవాలి

## -అంబేద్కర్ కు వినతిపత్రం అందించిన ఏపీడబ్ల్యూజే ఎఫ్ జర్నలిస్ట్ యూనియన్

శ్రీరంగరాజపురం: స్వర్ణ సాగరం: (మే 9)



ప్రజలకు ,ప్రభుత్వానికి, నాయకులకు వారిదిగా ఉండే జర్నలిస్టులను అవమానించడమే కాకుండా, వారిపై అక్రమ కేసులను బనాయించడం సబబు కాదని ఏపీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ నాయకులు తెలిపారు. ఓ ప్రముఖ దినపత్రిక ఎడిటర్ ఇంట్లో సోదాలు నిర్వహించడాన్ని ఖండిస్తూ శుక్రవారం మండల ఆవరణలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ గౌరవ సలహాదారులు, సీనియర్ జర్నలిస్ట్ మునికృష్ణ,జిల్లా ఉపాధ్యక్షులు ఎట్టేరి దేవరాజులు

గౌరవ సలహాదారులు కే యం ప్రేమ్ చంద్ గంగాధర నెల్లూరు నియోజకవర్గ కమిటీ సభ్యులు బాలాజీ , జిల్లా బిజెపి నాయకులు రాజేంద్రన్ పాల్గొన్నారు. చిత్తూరు జిల్లా ఏపీడబ్ల్యూజేఎఫ్ శాఖ కమిటీ ఆదేశాల మేరకు శుక్రవారం ఏపీడబ్ల్యూజేఎఫ్ ఎస్ఆర్ పురం బృందం ఘ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించి నిరసన తెలియజేశారు.

# శ్రీసిటీ-ఐఎఫ్ఎఫ్ పరిశ్రమ వితరణతో వడ్డిపాళెంలో కమ్యూనిటీ లైబ్రరీ ప్రారంభం

శ్రీసిటీ,స్వర్ణ సాగరం మే 08, 2025:

శ్రీసిటీలోని ఇంటర్నేషనల్ ఫ్లేవర్స్ అండ్ ఫ్రాగ్నాన్సెస్ (ఐఎఫ్ఎఫ్) పరిశ్రమ యాజమాన్యం తమ సీఎస్ఆర్ చర్యల్లో భాగంగా రూరల్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్మెంట్ (రీడ్) సంస్థ భాగస్వామ్యంతో వరదయ్యపాళెం మండలం వడ్డిపాళెం గ్రామంలో కమ్యూనిటీ లైబ్రరీ % రిసోర్స్ సెంటర్ ను ఏర్పాటు చేసింది. ఐఎఫ్ఎఫ్ ఆపరేషన్స్ హెడ్ శరవణన్ అరుణాచలం, శ్రీసిటీ డైరెక్టర్ (సిఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి దీనిని లాంఛనంగా ప్రారంభించారు. పిల్లలకు చదవడం, రాయడం వంటి నైపుణ్యాలతో పాటు, యువతి యువకులకు చేతివృత్తులలో శిక్షణ, ఆరోగ్య అవగాహన కల్పించడం కమ్యూనిటీ లైబ్రరీ % రిసోర్స్ సెంటర్ ముఖ్య ఉద్దేశ్యం. ఇందులో లైబ్రరీ, కంప్యూటర్ రూమ్, శిక్షణా హాల్ మరియు పిల్లలు, మహిళలకు ప్రత్యేక విభాగాలు ఉంటాయి. గ్రంథాలయంలో వివిధ పుస్తకాలతో పాటు స్పోకెన్ ఇంగ్లీష్, పోటీ పరీక్షలు, ఉన్నత విద్యకు అవసరమైన ఇ-కంటెంట్



కూడా అందుబాటులో ఉంటుంది. ఈ మేరకు రీడ్ ఇండియా బృంద సభ్యులు కమ్యూనిటీ లైబ్రరీ మరియు రిసోర్స్ సెంటర్ (CLRC) వలన ఒనగూరే ప్రయోజనాలను గ్రామస్థులకు వివరించారు.విద్య, కమ్యూనిటీ అభివృద్ధిని ప్రోత్సహించే ప్రయత్నంలో భాగంగా కమ్యూనిటీ లైబ్రరీ ఏర్పాటుకు తమ సంస్థ ముందుకు వచ్చినట్లు శరవణన్ అరుణాచలం పేర్కొన్నారు. దీనిని గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐఎఫ్ఎఫ్ పరిశ్రమ యాజమాన్యం సిఎస్ఆర్ చొరవను నిరీషా సన్నారెడ్డి అభినందించారు. వడ్డిపాళెం మరియు పరిసర గ్రామస్థులు, ముఖ్యంగా విద్యార్థులు, మహిళలు, దీని నుండి మంచి ఫలితాలను పొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఐఎఫ్ఎఫ్ ఫ్యాక్టరీ మేనేజర్ శరవణన్ బాలసుబ్రమణ్యం, ఫ్రాగ్నాన్సె హెడ్ రాజశేఖర్ మణి, హెచ్ ఆర్ హెడ్ అరుణ్ కుమార్, అడ్మిన్ హెడ్ వెంకట భాస్కర్, సిఎస్ఆర్ హెడ్ కార్తీక్ పళని, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్ర కుమార్, వడ్డిపాళెం మరియు పరిసర గ్రామస్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.






తిరుపతి
చిత్తూరు నెల్లూరు అనంతపురం
విలేకరులు కావలెను
సంప్రదించండి : 9440352036

# CRPF జవాన్ నూకతోటి పవన్ కళ్యాణ్ భౌతికకాయానికి నివాళులర్పించిన వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్



కనిగిరి స్వర్ణ సాగరం మే 9

పిసిపల్లి మండలం కొత్త ముద్దపాడు గ్రామానికి చెందిన నూకతోటి బాల చెన్నయ్య - ఆదిలక్ష్మమ్మ కుమారుడు CRPFజవాన్ నూకతోటి పవన్ కళ్యాణ్ ఛత్తీస్‌గఢ్ బోర్డర్ లో కూబింగ్ నిర్వహణ లో మావోయిస్టుల ఎదురు కాల్పులలో మరణించారు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చిన విషయం తెలుసుకొని శుక్రవారం ఉదయం నూకతోటి పవన్ కళ్యాణ్ భౌతికకాయాన్ని కనిగిరి వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ సందర్శించి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మృతిపట్ల వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి మనో ధైర్యం గా ఉండాలని అన్నారు.ఈ సందర్భంగా కనిగిరి వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన జవాన్ పవిత్ర ఆత్మ కు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా జై జవాన్,వీర జవాన్ అమర్ రహే అని నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బొర్రా రెడ్డి,జడ్పీటీసీ లక్ష్మీకాంతం ఒకే రెడ్డి , మాజీ సిం గల్ విండో చైర్మన్ పోలు జయరాంరెడ్డి,జడ్పీటీసీ మడతల కస్తూరి రెడ్డి,సైకం ఏడుకొం డలు రెడ్డి,మూలే రాజశేఖర్ రెడ్డి,ఎంపీటీసీ నారాయణరెడ్డి, నరసింహరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పునరుత్పత్తి ఆరోగ్యం- బాల్య వివాహాల వలన కలిగే నష్టాల గురించి అవగాహన



కనిగిరి స్వర్ణ సాగరం మే 09

బంగారు బాల్యంలో భాగంగా కిశోర వికాసం కార్యక్రమంలో శుక్రవారం కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో టకరిపాలెం అంగన్వాడీ కేంద్రం నందు కిశోర బాలికలకు పునరుత్పత్తి ఆరోగ్యం- బాల్య వివాహాల వలన కలిగే నష్టాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కిశోర బాలికల కోసం పునరుత్పత్తి ఆరోగ్యంపై అవగాహన చాలా ముఖ్యం అని ఐ సి డి ఎస్ సూపర్ వైజర్ మల్లేశ్వరి అన్నారు. వారిలో శారీరక, మానసిక ఎదుగుదలతో పాటు సురక్షిత భవిష్యత్తును అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పునరుత్పత్తి

ఆరోగ్యానికి సంబంధించినశరీర అభివృద్ధి అవగాహన,లైంగిక విద్యా,వ్యక్తిగతపరిశుభ్రత,ఆత్మవిశ్వాసం మరియు భావోద్వేగ నియంత్రణ వంటి ముఖ్య అంశాలపై అవగాహన కలిగించారు.బాల్యవివాహం నేరం మాత్రమే కాదు అది ఒక జీవితాన్ని దెబ్బతీసే దారుణమని బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలుఆరోగ్య సమస్యల గురించి వివరించారు.కార్యక్రమం లో ఫెసిలెటర్ ఎ ఎన్ ఎం లక్ష్మి, ఎన్ ఐ ఆర్ డి సర్టిఫైడ్ మాస్టర్ రిసోర్స్ పర్సన్ బంగారు బాల్యం కమిటి సభ్యులు గుడ్ హెల్ప్ రమేష్ బాబు,అంగన్వాడీ సూపర్ వైజర్ మల్లేశ్వరి, అంగన్వాడీ టీచర్స్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# కనిగిరిలో కలశాలతో మహిళల ఊరేగింపు

కనిగిరి స్వర్ణ సాగరం మే 9



కనిగిరి పట్టణం గార్లపేట్ట రహదారిలోని శ్రీదొంతులమ్మ ఆలయంలోని పోలేరమ్మతల్లి కలశ ఉత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు.పట్నంలోని దొరువు వద్ద ఉన్న శ్రీ కనకదుర్గమ్మ కోవెల నుండి పవిత్ర గంగాజలాలకును 108 కలశాలలో నింపుతున్న భక్తులు పట్టణంలో ఊరేగింపు చేపట్టారు.పోలేరమ్మ తల్లి ఆలయం వరకు వెళ్లి అమ్మవారికి గంగా జలాలతో అభిషేకించారు.

# నారా లోకేష్ తో ఆటోగ్రాఫ్

నాగలాపురం స్వర్ణ సాగరం మే 09:



తెలుగుదేశం పార్టీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశానికి వచ్చిన ఐ టి మరియు విద్యా శాఖ మంత్రి,టీడీపీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారా.లోకేష్ ను కలిసిన నాగలాపురం పట్టణ యువ నాయకుడు నరేంద్ర రెడ్డి,ఈ సందర్భంగా కుటుంబ చిత్ర పట్టం మీద నారా లోకేష్ ఆటోగ్రాఫ్ తీసుకోవడం జరిగింది.

# కిషోర్ బాలికలకు కిషోర్ కిషోర్ వికాసం పై అవగాహన కార్యక్రమం



కనిగిరి స్వర్ణ సాగరం మే 09

కనిగిరి మండలం చాకిరాల అంగన్వాడీ కేంద్రాల్లో కిషోర్ బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కనిగిరి సీడీపీఓ సరోజని ఆధ్వర్యంలో కిషోర్ వికాసం సమ్మర్ స్పెషల్ వేసవి శిక్షణ శిబిరం కార్యాచరణ క్యాలెండర్ ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో యుక్త వయసు గల కౌమార దశలో ఉన్న బాలికలకు ప్రత్యేక శిక్షణ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త దీపిక మాట్లాడుతూ కౌమార దశలో యుక్త వయసు గల పిల్లలు అంగనవాడి పరిధిలోని గ్రామంలోని వారిని గుర్తించి శారీరక మార్పులు మానసిక వికాసం గురించి వివరించారు.యుక్త వయసు గల అమ్మాయిలు ఆత్మ సంరక్షణ కొరకు తీసుకోవలసిన జాగ్రత్తలు సైబర్ నేరాలు సెల్ఫోన్ ద్వారా అపరిచిత వ్యక్తులతో సంభాషణలు చేయకూడదని అందువల్ల ఏర్పడే దుష్పరిణామాలు వివరించారు.ఆరోగ్య సిబ్బంది చిత్ర ప్రదర్శన ద్వారా కౌమారదశలో ఏర్పడే శారీరిక మార్పులు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు.ఈ కార్యక్రమంలో అంగనవాడి టీచర్ దీపిక ఆరోగ్య సిబ్బంది ఆశ వర్కర్లు కిషోర్ బాలికలు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ఆంజనేయ స్వామి నూతన విగ్రహ ప్రతిష్టాపన



అమరాపురం స్వర్ణ సాగరం మే 9

మండల పరిధిలోని నడలుడం గ్రామం నందు ఆంజనేయస్వామి నూతన దేవాలయం విగ్రహ పున ప్రతిష్టాపన మరియు శిఖర కలశ స్థాపన కార్యక్రమం శుక్రవారం వేద మంత్రోస్ఛ రణల మధ్య వైభవంగా జరిగింది. వేద పండితులు విశేష పూజల అనంతరం నూతన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం నూతన దేవాలయానికి శిఖర ప్రతిష్టాపన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా. ఈ సందర్భంగా స్వామి వారి సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. దేవాలయ నిర్మాణపు దాత చిత్రశేఖర్, శివరుద్రప్ప, సర్పంచ్ నాగవేణి హితేంద్ర, నాగేంద్రప్ప,నరసింహమూర్తి, విద్య సాగర్ ,నాగరాజు, శివకుమార్ బుజ్జి తదితరులు పాల్గొన్నారు. విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నడలుడం, వలస, విరపసముద్రం తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆంజనేయస్వామి కి విశేష పూజలు నిర్వహించారుఈ కార్యక్రమం నందు నడలుడం వలస విరపసముద్రం గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఇల్లు కోల్పోయిన కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించిన డాక్టర్ వివేక్



## 10 కుటుంబాలకు దాదాపు లక్ష రూపాయల వరకు చెక్కు రూపంలో ఆర్థిక సహాయం

స్వర్ణ సాగరం డోర్నకల్ మే 09

గత వారం రోజుల క్రితం కురిసిన అకాల వర్షంతో పాటు గాలి వాన బీభత్సానికి డోర్నకల్ మండలం గొల్లచర్ల పరిధి గ్రామంలోని హున్యా తండా, గోదా తండా,రాము తండా, బలపల గ్రామాలను డాక్టర్ వివేక్, సందర్శించి దాదాపు 10 కుటుంబాలకు ఆస్తి నష్టం జరగగా వారికి ఆర్థిక సహాయం దాదాపు లక్ష రూపాయలు వరకు చెక్కులను అందించారు. శుక్రవారం ప్రధాన బాధితుడు DSFI నాయకుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో ప్రతి తండను సందర్శించి వారితో డాక్టర్ వివేక్ మాట్లాడి బాధలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ వివేక్,మాట్లాడుతూ అకాల వర్షం వలన దాదాపు 10 కుటుంబాలు నివసిస్తున్న ఇళ్ల పై కప్పు ఊడిపోయి ఇబ్బందులు పడుతుంటే కనీసం ప్రభుత్వం కానీ ప్రభుత్వ అధికారులు ఎలాంటి సహాయక చర్యలు తీసుకోకపోవడం చాలా బాధాకరం అని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు...పేరుకు అధికార్లు సర్వేలు చేసి ఇప్పటి వరకు వారికి సహాయం అందించకపోవడం అంటే ప్రజల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు అని కొనియాడారు...తక్షణమే ఇల్లు కోల్పోయిన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు...తక్షణ సహాయంగా ప్రతి కుటుంబానికి 10 వేల రూపాయల చొప్పున లక్ష రూపాయల చెక్కులను అందించినట్టు తెలిపారు....ప్రజలకు ఎలాంటి ఆపద కలిగిన నేనున్న అంటూ భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ డివై గిరి, %ఙూఖీ×% రాష్ట్ర నాయకులు శాంతి కుమార్, సాయి కుమార్, సూర్య ప్రకాష్,విష్ణు,శివ వర్మ,నరేష్,తరుణ్,వినయ్, పవన్,సునీల్,గ్రామస్థులు వివేక్ సార్ అభిమానులు పాల్గొన్నారు..

# కనిగిరి మున్సిపాలిటీ గార్లపేట రోడ్డులో మద్యం షాపు ఏర్పాటు చేస్తే మద్యం సీసాలు పగులుతాయ్

**మద్యం షాప్ వద్ద మద్యం లోడు దించకుండా ఐద్వా ఆధ్వర్యంలో అడ్డుకున్న మహిళలు**

**ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తానని ఎక్సైజ్ సీఐ హామీ**



కనిగిరి స్వర్ణ సాగరం మే 09

కనిగిరి మున్సిపాలిటీ ఒకటవ వార్డు పరిధిలోని గార్లపేట రోడ్డులో మద్యం షాపు ఏర్పార్టును ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు శుక్రవారం మధ్యాహ్నం అడ్డుకున్నారు.ప్లే కార్డులు ప్రదర్శిస్తూ మద్యం షాపు వద్దు మంచినీళ్లు కావాలంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.మద్యం లోడును షాపులో దించకుండా అడ్డుకొని ఆందోళన చేపట్టారు. షాపు నిర్వాహకులతో వాగ్వాదానికి దిగి మద్యం షాపు ఏర్పాటు చేయడానికి లేదని ఏర్పాటు చేస్తే మద్యం సీసాలను పగలగొడతామని హెచ్చరించారు. హాస్పటల్, సచివాలయం, పాఠశాలలు, వసతి గృహాలు, ఆలయాలు, పేదలు నివసించే ఈ ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటు చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను తెలుసుకున్న ఎక్సైజ్ సీఐ ఆర్ విజయభాస్కర్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పేదలు ఉండే చోట మద్యం షాపు ఏర్పాటు చేస్తే తమ కుటుంబాలు చిన్నాభిన్నమైపోతాయని, గొడవలు పెరుగుతాయని, మహిళలకు రక్షణ లేకుండా పోతుందని అలాంటప్పుడు మద్యం షాపును ఎలా ఏర్పాటు చేయాలనుకున్నారని ఎక్సైజ్ సీఐ విజయభాస్కర్ ను నిలదీసి ప్రశ్నించారు. ఇక్కడ బ్రాందీ షాపు ఏర్పాటు చేయవద్దని కోరారు. గతంలో కూడా ఒకసారి ప్రయత్నం చేశారని అప్పుడు అడ్డుకోవడం జరిగిందని, సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని మీ ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటు చేయకుండా చూస్తానని ఆయన హామీ ఇచ్చారని సిఐకి తెలిపారు. ఇక్కడ షాపు ఏర్పాటు చేయడం వలన మీకు కలిగే ఇబ్బందులను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోవడం జరుగుతుందని న్యాయం చేస్తానని ఎక్సైజ్ సీఐ ఆర్ విజయభాస్కర్ హామీ ఇవ్వడం జరిగింది. సీఐ ఆదేశాల మేరకు మద్యం షాపు ఏర్పాటుకు తీసుకువచ్చిన మద్యం లోడు వాహనం ను నిర్వాహకులు వెనక్కి తీసుకు వెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా ఐద్వా నాయకులు వేము వెంకటమ్మ, సిపిఎం కనిగిరి పట్టణ కార్యదర్శి పిసికేశవరావు మాట్లాడుతూ మద్యం షాపు వద్దని వ్యతిరేకిస్తున్న బలవంతంగా ఈ ప్రాంతంలో షాపు ఏర్పాటు చేయాలని ప్రయత్నం చేయడం ఎవరి ప్రయోజనం కోసం అని విమర్శించారు. ఇప్పటికైనా మద్యం షాపు ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయడాన్ని ఉపసంహరించుకోవాలని లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వెంకట సత్యవతి, పి గంగాభవాని, రామచంద్రయ్య, మాలకొండయ్య,పి నరేంద్ర స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహం చట్ట రీత్యా నేరం..





**సూపర్వైజర్ భారతి**

శ్రీ రంగరాజపురం :స్వర్ణసాగరం: (మే 9 )

సమాజంలో బాల్య వివాహం చేసుకోవడంతో అనేక అనర్థాలకు దారితీస్తుంది, అలాగే వయసు రీత్యానే కాకుండా, జన్యుపరంగా లోపాలు సంభవించడంతో పాటు,బాల్యం పుట్టుకలో అంగవైకల్యానికి దారితీస్తుందని అంగన్వాడి సూపర్వైజర్ భారతి , మహిళా పోలీస్ పుష్పలత తెలిపారు. మండలంలోని నెలవాయి సచివాలయ పరిధిలోని చీర సముద్ర%శీ% గ్రామంలో బాల్య వివాహం పై మహిళా సిబ్బందికి, మహిళలకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలతో నిత్యం అనారోగ్య బారిన పడడమే కాకుండా, జీవితాంతం ఆరోగ్య సమస్యలు ఎదురవుతావుంటాయని చెప్పారు. మహిళలు పునరుత్పత్తి, కిషోర్ బాలికల కు అందించి పోషకాలను సమన్వయంతో వ్యవహరించా లన్నారు. కౌమార దశ నుంచి యవ్వన దశ వరకు ,పిల్లలపై జాగ్రత్త వహించాలని తల్లిదండ్రులకు సూచించారు. సమాజంలో బాల్య వివాహలం చేసుకోవడంతో పలు చెడు సంకేతానికి కారణం అవుతాయన్నారు. ఇలాంటి వాటిని స్థానికులు గుర్తించి మహిళా సంఘసంస్కర్తలకు సమాచారం చేరవేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు, మహిళ సంఘ సభ్యులు ,తదితరులు పాల్గొన్నారు.

# భారత సైనికులకు అండగా హనుమాన్ కు ప్రత్యేక పూజలు

**పూజలో పాల్గొన్న కేంద్ర మంతి భూపతిరాజు శ్రీనివాసవర్మ.**

**కేంద్ర మంత్రికి రాకెట్ చిత్రపటాన్ని జ్ఞాపిక గా అందజేసిన డీవీఎంసీ మెంబెర్ గుత్తి త్యాగరాజు**

వరదయ్య పాలెం, స్వర్ణ సాగరం మే 09



భారత సైనికులకు మానసిక శక్తిని అందించేందుకు,హనుమాన్ కు ప్రత్యేక పూజలు నిర్వహి ంచా రు.తమిళనాడు నుండి ఆంధ్ర పదేశ్ సరిహద్దులో మంత్రికి బీజేపీ శ్రేణులు సాదర స్వాగతం పలికా రు.తడ మండలం ,పన్నంగాడు లోని ప్రముఖ హనుమాన్ ఆల యంలో ఈ పూజలు అంగరంగ వైభవంగా సాగాయి.దేశ రక్షణ కోసం నిరంతరం విధులు నిర్వహిస్తున్న సైనికుల సంక్షేమాన్ని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కేంద్ర భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ పాల్గొన్నారు.బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి కూడా హాజరయ్యారు.హనుమాన్ కు పూజలు,ప్రార్థనలు చేసి,సైనికుల విజయం కోసం ఆశీస్సులు కోరారు.కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ మాట్లాడుతూ భారత త్రివిధ బలగాలకు శక్తిని ప్రసాదించింది విజయకేతనం ఎగురవేయాలని,భారత స్త్రీల నుదుట సింధూరం దూరం చేసిన ఉగ్రవాదుల ఏరివేతకు,ఆపరేషన్ సింధూర్ జయప్రదం కావాలని,భారత ప్రజలు కోరుకుంటున్నారని మంత్రి అన్నారు.భారత ప్రభుత్వం నిర్ణయంకు ప్రజలు సంపూర్ణ మద్దత్తు ఇవ్వడం ప్రధాని నరేంద్ర మోదీ పై బలమైన నమ్మకం అన్నారు.ఆదినారాయణ రెడ్డి, మునికృష్ణయ్య ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు మంత్రిని ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి రాకెట్ చిత్రపటాన్ని,జ్ఞాపికను డీవీఎంసీ మెంబెర్ గుత్తి త్యాగరాజు,మన్నెముద్దు శ్రీనివాసులు అందజేశారు.పూజా కార్యక్రమంలో బీజేపీ నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.దేశభక్తి భావాలు వ్యాపించేలా నినాదాలు చేశారు.డీవీఎంసీ మెంబెర్ ఆంధ్రప్రదేశ్ దేవాంగ అభ్యుదయ సేవా సంఘం కన్వీనర్ గుత్తి త్యాగరాజు మాట్లాడుతూ,భారత ప్రభుత్వ నిర్ణయానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు.దేశ రక్షణ కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ప్రశంసనీయమని ఆయన అభిప్రాయపడ్డారు.సూళ్లూరుపేట,సత్యవేడు నియోజకవర్గం బీజేపీ నాయకులు విశేష స్పందన చూపారు.సత్యవేడు బీజేపీ మండల అధ్యక్షుడు బాలాజీ,మండల ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్ మండల అధికారం ప్రతినిధి,సత్యవేడు మాజీ ఎంపీటీసీ బం డారు మోహన్ బాబు,సూళ్లూరుపేట నుండి కిరణ్ కుమార్ గౌడ్,నూతలపాటి శ్రీనివాసులు ,విజయమ్మ,నిర్మల కుమారి,పిచ్చిక సూరిబాబు,కృష్ణ మూర్తి,తేజ రెడ్డి,గోపి ఆచారి,వాసురెడ్డి,దయాల్,పాల్గొన్నారు.

# కిశోర వికాసం పై అవగాహన సదస్సులు, ర్యాలీ లు నిర్వహణ





స్వర్ణ సాగరం ఏర్పేడు మే 9

కిశోర వికాసం పై అవగాహన సదస్సులు, ర్యాలీ లు నిర్వహించారు. మండలంలోని ఆమందూరు సచివాలయము పరిధిలో, కాట్రా కాయలగుంట అంగన్వాడి కేంద్రంలో ఈ అవగాహన సదస్సులు ర్యాలీలు రేణిగుంట ఐసిడిఎస్ సిడిపిఓ కృష్ణ మంజరి అధ్యక్షతన నిర్వహించారు ఈ సందర్భంగా కృష్ణ మంజరి మాట్లాడుతూ కిశోర బాలికలు ఆత్మరక్షణ ,నైపుణ్య ఉపాధి ,అంగ వివక్షత తదితర అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి అని అన్నారు. ఆమందూరు అంగన్వాడీ కేంద్రంలో కాట్రా కాయలకుంట అంగన్వాడీ కేంద్రంలో కిశోర వికాసం అనే అంశంపై సిడిపిఓ కృష్ణ మంజరి మాట్లాడారు. నాణ్యమైన విద్య, సంపూర్ణ ఆహారంతో ఆరోగ్యం, వ్యక్తిగత రుతు స్రావ పరిశుభ్రత, లైంగిక వేధింపుల నుండి రక్షణ, బాల్య వివాహాలు అరికట్టడం, మానవ అక్రమ రవాణా తదితర అంశాలపై ఆమె కిశోర బాలికలకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ రత్నమ్మ, అంగన్వాడి వర్కర్లు నచనేరి, నాగంపల్లి ,బీసీ కాలనీ, ఆమందురుల వర్క్ లు సునీత, లక్ష్మి, ధనమ్మ ఎం ఎస్ కె శిరీష, ఏఎన్ఎం గంగాదేవి ఆశా వర్కర్ జయచిత్ర, హెల్పర్లు తుషారా రేఖ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక



# "అరగొండ - పల్లెచెరువు మార్గంలో నూతనంగా నిర్మిస్తున్న బీటీ రోడ్డును పరిశీలించిన పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్.. "





## "గత ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి నిర్వీర్యం.."

## "గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత.."

స్వర్ణసాగరం తవణంపల్లె మే-9

పూతలపట్టు నియోజకవర్గం, తవణంపల్లె మండలం పరిధిలోని అరగొండ – పల్లెచెరువు మార్గంలో నూతనంగా నిర్మిస్తున్న బీటీ రోడ్డును పూతలపట్టు శాసనసభ్యులు డా. మురళీమోహన్ పరిశీలించారు. శుక్రవారం సాయంత్రం అరగొండ నుండి పల్లెచెరువు మార్గంలో దాదాపు 2.3 కిలోమీటర్ల పొడవుతో నూతనంగా నిర్మిస్తున్న బీటీ రోడ్డును అధికారులు, నాయకులతో కలిసి ఆయన పరిశీలించి రోడ్డు నాణ్యత విషయంలో రాజీపడొద్దని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "గత ప్రభుత్వం పాలనలో గ్రామాల అభివృద్ధి పూర్తిగా నిర్వీర్యమైందని మండిపడ్డారు. ఎక్కడ చూసినా రోడ్లు గుంతల మయంగా మారి, ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడ్డారని ఆయన గుర్తు చేశారు. గత ప్రభత్వం అభివృద్ధి పేరుతో మాటలు చెప్పడమే తప్ప, పనులు చేయలేదని ఆరోపించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యం ఇచ్చిందని తెలిపారు. ప్రతి పల్లె రోడ్డు మెరుగుపడాలి, ప్రతి చెరువు పునరుద్ధరించాలి, ప్రతి ఇంటికి మౌలిక సదుపాయాలు చేరాలి అనే దృక్పథంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలియజేశారు. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించి సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, గ్రామాలకు మౌళిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని గుంత రోడ్లల్లో ప్రయాణించలేని స్థాయి నుండి రోడ్లపై ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రజలు ధైర్యంగా గమ్యస్థానం చేరుకునే స్థాయికి కూటమి ప్రభుత్వం రోడ్లను బాగు చేసి ప్రతి రూపాయని ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఖర్చు చేస్తుందని పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు నియోజకవర్గం ముఖ్య నాయకులు, మండల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# "సాగునీటిని పొదుపు చేయండి. రెండవ కారు పండించుకోండి."

## కోడూరు కాలువ పరిశీలన సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి

తోటపల్లి గూడూరు స్వర్ణసాగరం మే9

సాగునీటిని పొదుపు చేసి రెండవ కారు పంటను జాగ్రత్తగా పండించుకోవాలని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి రైతాంగానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సాగునీటి సంఘం నేతలు టిడిపి నాయకులతో కలిసి కోడూరు కాలువ పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోమశిల జలాశయంలో ప్రస్తుతం 50 టీఎంసీల నీటిని నిల్వ ఉందన్నారు తాగునీటి అవసరాలు డెడ్ స్టోరేజ్ పోను 35 టీఎంసీలనికర జలాలను సర్వేపల్లి నియోజకవర్గంలో ఒక లక్ష ఎకరాల్లో పంట పండించుకోవడానికి వీలవుతుందని రైతాంగం అర్థం చేసుకొని నీటిని పొదుపుగా వాడి రెండవ కారును జాగ్రత్తగా పండించుకోవాలని సూచించారు.ఐఏబి తీర్మానం ప్రకారం రెండో పంటకు సుమారు నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు.సర్వేపల్లి కనిగిరి రిజర్వాయర్లలో అద నంగా నీళ్ల అందుబా టులో ఉన్నాయన్నారు.రెండో కారుకు కొందరు రైతులు ఆసక్తి చూపగా మరికొందరు వేయడం లేదని తెలిపినట్లు ఆయన చెప్పారు గతంలోవైకాపా పాలనలో సోమశిలాల జలాల సాగునీటి సరఫరాలో నీటిని అవగాహన లోపంతో వృధా చేసినట్లు ఆయన ఆరోపించారు.ఇరిగేషన్ పనులలో నిధులు దుర్వినియోగమైనట్లు విమర్శించారు.ఈ పరిశీలనలో ఎమ్మెల్యేతో పాటు జాఫర్ సాహెబ్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర. మండల పార్టీ అధ్యక్షులు సన్నారెడ్డి సురేష్ రెడ్డి ప్రధాన కార్యదర్శి ముత్యాల శ్రీనివాసులు, నాగేశ్వరరావువరిగొండ కోడూరు శ్రీనివాసుల రెడ్డి చావా కోటయ్య నాయుడు గోపాల్ నాయుడు చావా రమేష్ నాయుడు చింత సీతారామయ్య మన్నెం జితేంద్ర మన్నెం మధుసూదన్ గౌడ్ కొణతం రఘు బాబు వల్లభనేని వంశీ ప్రసాద్ చావా రవీంద్రనాయుడు మాగుంట రమణారెడ్డి చేవూరు శ్రీనివాసులు శ్రీహరి చెరుకూరు పరంధామనాయుడుఇరిగేషన్ ఏఈ షేక్ మాలిక్ అలీ వర్క్ ఇన్స్పెక్టర్ వెంకటసుబ్బయ్య రైతులు టిడిపి నేతలు పాల్గొన్నారు



# జనసేన పార్టీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్



వెంకటాచలం స్వర్ణసాగరం మే9

మండలంలోని ఇడి మే పల్లి పంచాయతీ పరిధిలోని రాళ్లపల్లి కి అనుకుని ఉన్న గిరిజనకాలనీలో సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు ఈ కాలనీలో ప్రభుత్వం కొంత స్థలాన్ని గిరిజనుల యొక్క కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు కేటాయించడం జరిగింది. ఈ స్థలం లో కంపచెట్లు చెత్తతో పేరుకుపోయి ఉండడంతో చుట్టుపక్కల హాస్యం ఉన్న గిరిజన పిల్లలందరూ కూడా అక్కడ తిరగాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారని మా దృష్టికి రావడం జరిగింది వెంటనే ఈరోజు ఏసీబీతో కంప చెట్లను తొలగించి అక్కడ చెత్త వేయకుండా చెత్త వేసుకునే దానికి సిమెంటు వరలను ఏర్పాటు చేయడం తోపాటు చల్లని నీడనిచ్చే పచ్చని మొక్కలను నాటడం జరిగింది జనసేన పార్టీ ప్రజల కోసం ప్రజా సమస్యలను పరిష్కరించటం కోసం ప్రజల కోరిక మేరకు ఎప్పుడు కూడా అందుబాటులోఉంటుందన్నారు గుర్తుపెట్టుకోవాలన్నారు గ్రామపంచాయతీలలో ఇంకా వైసీపీ పంచాయతీ ప్రెసిడెంట్లు ఉన్నారు కాబట్టి పంచాయతీలకు పవన్ కళ్యాణ్ నిధులు తీసుకువస్తున్న ఆ నిధులని సక్రమంగా వినియోగించకుండా గత ఐదేళ్లు వాళ్ళు ఎలా అయితే ప్రవర్తించారు అలాగే ఇప్పటికీ కూడా కొనసాగుతున్నారని తెలిపారు త్వరలోనే స్థానిక ఎన్నికలలో చెత్త ని అంతా కూడా క్లీన్ చేసి స్వచ్ఛమైన కూటమిని నమ్మి ప్రజలు గెలిపించే పంచాయతీ పాలకులతో ఇంకా గ్రామాలలో మెరుగైన అభివృద్ధిని చేస్తా ఇకనైనా సరే వైసిపి హయాంలో పంచాయతీలలో తెలిసినటువంటి పంచాయతీ అభ్యర్థులారా ఒకసారి మేలుకోండి మీరు మేలుకోకపోతే ఒకటికి రెండుసార్లు మేము మేలుకొలుపుతా అప్పటికి కూడా లేకపోతే పూర్తిస్థాయిలో నిద్రలోకి వెళ్ళిపోతారు ఈ విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు

ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గుమ్మినేని వాణి భవాని నాయుడు, పినిశెట్టి మల్లికార్జున్ ,వెంకటాచల మండలం నాయకులు చెంచయ్య, మణి, చిరంజీవి,స్థానిక గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# వరకవిపూడి సచివాలయంలోకిశోర వికాసం

తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం మే9



మండలంలోని వరకవిపూడి సచివాలయంలో శుక్రవారం అంగన్వాడి ఆధ్వర్యంలో కిశోర కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సమావేశంలో బాల్య వివాహాల నిషేధం చిన్న వయస్సులో గర్భధారణ ఆరోగ్య సమస్యలు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారుఈ కార్యక్రమంలో ఇందుకూరుపేట సిడిపిఓ రాజ్యలక్ష్మి సుమలత ఏఎన్ఎం పోలమ్మ అంగన్వాడి సూపర్వైజర్ పిరంగమ్మఅంగన్వాడీ టీచర్లు సువార్తమ్మ కవితరాజేశ్వరి అరుణఆశా వర్కర్ ప్రసూన తదితరులు పాల్గొన్నారు

# సైనిక వీరమరణానికి ...

# డాక్టర్ వి.ఎం థామస్ సంతాపం





శ్రీ రంగరాజపురం :స్వర్ణసాగరం: (మే 9)

ఆపరేషన్ సింధూర్లో భాగంగా భారత ప్రభుత్వం చేపట్టిన సైనిక చర్య లో పాల్గొని జమ్మూ కాశ్మీర్ యుద్ధభూమిలో వీర మరణం పొందిన మురళి నాయక్ మృతి తీరని లోటని ఎమ్మెల్యే వి.ఎం థామస్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శుక్రవారం మండల ఆవరణ కేంద్రంలో టిడిపి నాయకుడు జయరాజ్ ఏర్పాటుచేసిన జిరాక్స్ కేంద్రాన్ని తన కుటుంబ సమేతంగా హాజరై ప్రారంభించారు... ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశం కోసం అమరులైన వారికి రెండు నిమిషాలు మౌనవ్రతం పాటించారు. అనంతరం ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకి జిరాక్స్ కేంద్రాన్ని ప్రారంభించి, జయరాజ్ కుటుంబాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు జయశంకర్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యనిర్వతులు రాజశేఖర్ నాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు భాస్కర్ నాయుడు, రుద్రప్ప నాయుడు, టిడిపి నాయకులు ధనుంజయ నాయుడు, టిడిపి ఐటి విభాగం నేత పైనేని మురళి, తదితర నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేంద్ర సహాయ మంత్రిని కలిసిన బిజెపి గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పొట్లూరి



నెల్లూరు స్వర్ణ సాగరం మే 9

నెల్లూరు పర్యటనకు వచ్చిన కేంద్ర ఉక్కు గనుల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మను బిజెపి గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పొట్లూరు శ్రీనివాసులు దాసరి శరవణ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కేంద్ర మంత్రి ద్వారా నెల్లూరు జిల్లా అభివృద్ధి పథంలో నడుస్తుందన్న ఆశాభావాన్ని వారు వ్యక్తపరిచారు

# 10నజంగిల్ క్లియరెన్స్ కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం

## వినియోగదారులకు ఏఈ విజ్ఞప్తి

తోటపల్లి గూడూరు స్వర్ణసాగరం మే9

మండలంలోని విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలో శనివారం జంగిల్ కటింగ్ కారణంగా క్రింద తెలిపిన ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉదయం 8.30గంటల నుంచి

మధ్యాహ్నం 12:00 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ బి సుకుమార్ తెలిపారు

తోటపల్లి గూడూరు సాలిపేట మండపంవిద్యుత్ సబ్స్టేషన్ పరిధిలో పేడూరు ఈ దూరువరకవి పూడిపాపిరెడ్డి పాలెం ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.వినియోగదారులుఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు

# పార్టీ కోసం కష్ట పడినవారికే ప్రాధాన్యం ఇవ్వండి..



## కటిక పల్లి టిడిపి నాయకులు ఎమ్మెల్యే దృష్టికి ఫిర్యాదు

శ్రీరంగరాజపురం :స్వర్ణసాగరం: (మే 9)

ఎన్నికలప్పుడు కష్టపడిన వారిని మరిచి, ప్రస్తుతం బడా నాయకులకు వత్తాసు పలకడం సరికాదని కటిక పల్లి టిడిపి నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం థామస్ కు అర్జీ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీకి పనిచేసామని, ప్రస్తుతం మీరు ప్రాధాన్యం ఇస్తున్న వ్యక్తి, కష్టకాలంలో వైసిపి పక్షాన నిలబడి క్వారీలు నిర్వహించడం జరిగిందన్నారు. అలాంటి వ్యక్తికి పార్టీ పక్షాన పదవులే పోవడం సరికాదన్నారు.. అలాగే పంచాయతీలు ప్రజా అవసరార్థం సమస్యలు ఉన్నాయని, అందుకు మీరు సహకరిస్తే పేదలు బాగుపడతారని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత కార్య నిర్వహణ కార్యదర్శి కే శేఖర్, మాజీ సర్పంచ్ బాబు నాయుడు, మాజీ ఎంపీటీసీలు వేమన నాయుడు, కేఎం రవి, బూత్ కన్వీనర్ ధనంజయ నాయుడు, మాజీ సింగల్ బెడ్ డైరెక్ట్ బాబు నాయుడు, టీఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి జగదీష్ నాయుడు, కార్యకర్త చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కటికపల్లి పంచాయతీ సమస్యలను పరిస్కరించాలని ప్రభుత్వ విప్ గంగాధర నెల్లూరు mla దృష్టి కి తీసుకెళ్లిన జిల్లా తెలుగు యువత కార్యనిర్వాహకకార్యదర్శి శేఖర్ మాజీ సర్పంచ్ బాబు నాయుడు ,మాజీ ఎంపీటీసీ లు వేమన్న నాయుడు,K.M.రవి,బూత్ ,ప్కన్వీనర్ ధనంజేయనాయుడు,మాజీ సింగిల్ విండో డైరెక్టర్ బాబు నాయుడు,nsf కార్యదర్శి ,జగదీష్ నాయుడు,కార్యకర్త చిరంజీవి తదితరులు

# జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లుకు ఎమ్మెల్యే కోనేటి అదిమూలం వినతి



సత్యవేడు స్వర్ణ సాగరం మే 09

సత్యవేడు నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలంటూ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లుకు విన్నవించారు. శుక్రవారం సాయంత్రం తిరుపతి లోని జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కలెక్టర్ ను కలిసి ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తుడా నిధులతో పిచ్చాటూరు ఆరణియార్ వద్ద నిర్మిస్తున్న టూరిజం పనులు పూర్తి చేయడానికి అదనంగా రూ.40 లక్షలు నిధులు కేటాయించాలని కలెక్టర్ ను కోరారు.స్పందించిన కలెక్టర్ వెంటనే తుడా వైస్ చైర్మన్ మౌర్య రెడ్డి కి ఫోన్ చేసి నిధులు మంజూరుకు సహకరించాలని కోరారు.అలాగే సత్యవేడు మండలం లోని వా నెల్లూరు లో ఉన్న ఏం.ఐ.జీ భూములను తుడా నిధులతో అభివృద్ధి చేసి తక్కువ ధరకు పేదలకు పంపిణీ చేయాలని కలెక్టర్ ను ఎమ్మెల్యే కోరగా వెంటనే స్పందించి భూములను పరిశీలించి చర్యలు తీసుకోవాలని జేసీ శుభం భన్సాల్ కు కలెక్టర్ సూచించారు.నారాయణవనం మండలం లో ఎకో పార్క్ ఏర్పాటుకు నిధులు కేటాయించాలని కలెక్టర్ ను ఎమ్మెల్యే కోరారు.చివరగా సురుటుపల్లి తో పాటు నియోజకవర్గంలో అత్యవసరమైన చోట్ల రోడ్లు నిర్మాణం చేపట్టాలని, ఇందుకు సంబంధించిన జాబితాను కలెక్టర్ కు అందించారు.తన వినతులను కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు.

# కేంద్ర మంత్రిని కలిసిన ఇందుకూరుపేట బిజెపి నేతలు

నెల్లూరు స్వర్ణసాగరం మే 9



కేంద్రభారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మను శుక్రవారం ఇందుకూరుపేట బిజెపి నేతలు రాష్ట్ర నాయకులు సురేంద్ర రెడ్డి గృహంలో ఇందుకూరుపేట బిజెపి సీనియర్ నేతలు మారుబోయిన శ్రీనివాసులు జిల్లా అధ్యక్షులు వంశీధర్ రెడ్డి బిజెపి మండల అధ్యక్షులు కైలాసం శ్రీనివాసులు రెడ్డి జిల్లా కార్యదర్శి దువ్వూరు శ్రీనివాసులు తదితరులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి అభినందనలు తెలిపారు

# “సేవలందించడంలోఖాతాదారుల అభిమానంచూరగొన్న సహాయ మేనేజర్ సాయి భరత్”



బదిలీ వీడ్కోలు సందర్భంగాఅభినందన సమావేశంలోప్రశంసలు

తోటపల్లి గూడూరు స్వర్ణసాగరం మే 9

ఖాతాదారులకుసేవలు అందించడంలో తనకు తానే సాటి అనిపించుకున్న సౌమ్యులువి సాయి భరత్ అని బదిలీ సందర్భంగా అభినందన సమావేశంలో బ్యాంకు ప్రతినిధులు ఖాతాదారులు కొనియాడారు శుక్రవారం కోదూరుకెనరా బ్యాంకులో సహాయమేనేజర్ గా పని చేస్తూ బదిలీపై చెన్నై రెడ్ హిల్స్ కెనరా బ్యాంకుకు బదిలీ కావడం జరిగింది.కెనరా బ్యాంక్ మేనేజర్ శివకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన సమావేశంలో ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు.ఖాతాదారులు సిబ్బందితో సమైక్యంగా స్నేహపూర్వకంగా పనిచేస్తూ విధి నిర్వహణలో 2002 నుంచిపనిచేస్తూ తనకు తానే సాటి అని నిరూపించుకున్నారని తెలిపారు ఆయన బదిలీ తాము జీర్ణించుకోలేకపోతున్నామని ఖాతాదారులు పేర్కొన్నారు. సన్మాన గ్రహీత సాయి భరత్ మాట్లాడుతూ కర్తవ్యనిర్వహణలో భాగంగా విధులు నిర్వహించానని కోదూరు బ్యాంక్ అభిమానం మరిచిపోలే నని అన్నారు. ఈ సమావేశంలో బ్యాంక్ మేనేజర్ శివకుమార్ తోపాటు ఏ ఈ ఓ శాంత కుమారి శిరీష రాజేష్ చంద్రశేఖర్ వంశి దయాసాగర్ వై చంద్రశేఖర్ రెడ్డి ఖాతాదారులు అభిమానులు పాల్గొన్నారు

# చిన్న పిల్లలకు ఏ విటమిన్ ద్రవం పంపిణీ





బంగారుపాళ్యం.స్వర్ణసాగరం.మే 9

చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండల కేంద్రంలోని బంగారుపాళ్యం 1,2,3 అంగన్వాడీ సెంటర్స్ లోని 5 సంవత్సరాల లోపు పిల్లలకు ఏ విటమిన్ ద్రవం బంగారుపాల్యం లోని గ్రేడ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు డాక్టర్ శేషాద్రి ఆధ్వర్యంలో ఏ విటమిన్ ద్రవం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా డాక్టర్ శేషాద్రి మాట్లాడుతూ ఏ విటమిన్ ద్రవం వాడడం వలన పిల్లలకు కంటి చూపు బాగా కనబడుతుందని, ఆరోగ్యంగా బలంగా ఉంటారని,అమ్మోరు రాదని తెలియచేసి అవగాహన కల్పించి ఏ విటమిన్ ద్రవం పిల్లలకు ఇవ్వడం జరిగింది.

అలాగే బంగారుపాళ్యం 1 అంగన్వాడీ సెంటర్ నందు పిల్లలకు గదిలో ఫ్యాన్ లేకపోవడంతో గ్రేడ్స్ సంస్థ అధ్యక్షులు డాక్టర్ శేషాద్రి పిల్లల కోసం ఫ్యాన్ వితరణగా అంగన్వాడీ టీచర్ భారతి కి పేరెంట్స్ కు ఫ్యాన్ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ బంగారుపాళ్యం 1 భారతి, బంగారుపాళ్యం 2 శశికళ, బంగారుపాళ్యం 3 సుజాత, శాంతినగర్ సుజాత హాజరైనారు. గ్రేడ్స్ సంస్థ సిబ్బంది దొరబాబు, శారద, ఆరీఫ తదితరులు పాల్గొన్నారు

# కిషోరి వికాసం సమ్మర్ క్యాంపు కార్యక్రమం

బైరెడ్డిపల్లి స్వర్ణసాగరం మే 09:-



చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలం తీర్థం పరిధిలో ఉన్న ఎం కొత్తూర్ మరియుగడ్డూరు గ్రామాలలో డాక్టర్ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో కిషో రి వికాసం సమ్మర్ క్యాంప్ ప్రోగ్రాం ఈసందర్భంగా “ బాల్యవివాహాలు నిర్మూలించాలి అను నినాదంతో బాల్యవివాహాలు, చిన్న వయస్సు లో గర్భము దాల్చుట వలన కలిగే నష్టాలు గురించి వివరించడం జరిగింది. అలాగే HE కాంతమ్మ మాట్లాడుతూ చిన్న వయస్సులో పెళ్లి చేసుకున్న యెడల శారీరక కంగా,మానసికంగా ఎదుగు దల లేకపోవడం వలన కలిగే నష్టాలు గురించి మరియు చదువుయెక్క ప్రాముఖ్యత , వ్యక్తిగత శుభ్రత, పాటించడం వల్ల లాభాలుగురించి వివరించడం జరిగింది. ఈకార్యక్రమంలో సెక్రటరీ రాము, సుజాత, %o% దాక్షాయణి, జయలక్ష్మి,శివరాణి ఆషా భువనేశ్వరి రషీద పాల్గొన్నారు.

# గర్భిణీ స్త్రీలు ఆరోగ్య సూత్రాలు పాటించాలి

## వైద్యాధికారిని గౌరీ

శ్రీరంగరాజపురం: స్వర్ణ సాగరం :మే ( 9)



గర్భవతులు పోషక ఆహారాలను సద్వినియోగం చేసుకుని, తగువైన రీతిలో పరీక్షలు చేసుకుని వెళ్తే ,పుట్టే బిడ్డ ఆరోగ్యవంతులుగా ఉంటారని వైద్యాధికారిని గౌరీ తెలిపారు. మండలంలోని ఆరిమాకులపల్లి ప్రాథమిక వైద్య కేంద్రంలో శుక్రవారం పీఎం సురక్షిత,మాతృత్య అభియాన్ ప్రోగ్రాం కింద గర్భవతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. గర్భవతులు ప్రతినిత్యం దగ్గర్లో ఉన్న వైద్య సిబ్బందిని సంప్రదించి, వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సురక్షిత ఆరోగ్యం కావాలంటే, తప్పక వైద్య సూత్రాలను పాటించాలని తెలిపారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ కేశవరెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో శ్రీధర్ రెడ్డి అధ్యక్షులు గర్భవతులందరికీ ఉచితంగా అన్నదాన కార్యక్రమం అందించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రెడ్ క్రాస్ ఇంచార్జ్ పాపిరెడ్డి, వైద్య సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరిమాకుల పల్లిలో ఈరోజు ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ ప్రోగ్రాం సందర్భంగా డాక్టర్ గౌరీ ఆధ్వర్యంలో గర్భవతుల ందరిని పరీక్షించి, వైద్య సేవలు అందించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చినటువంటి గర్భిణీ స్త్రీలు అందరికీ కావలసిన రక్త పరీక్షలు చేసి మందులు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ కేశవరెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో Sridhar రెడ్డి గారు రెడ్ క్రాస్ అధ్యక్షులు గర్భవతులందరికీ ఉచితంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గంగాధర నెల్లూరు రెడ్ క్రాస్ ఇంచార్జ్ పాపి రెడ్డి గారు అన్నదాన కార్యక్రమాన్ని జరిపించారు. ఈ కార్యక్రమంలో, వైద్య ఆరోగ్య సిబ్బంది అందరూ పాల్గొన్నారు.

# పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రి సివిల్ అసిస్టెంట్ సర్జన్ గా చందనప్రియ

బంగారుపాళ్యం.స్వర్ణసాగరం.మే 9





చిత్తూరు జిల్లా పూతపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మేజర్ పంచాయతీ నెహ్రూ వీధికి చెందిన గ్రేడ్స్ సంస్థ అధ్యక్షులు డాక్టర్ ఎస్ శేషాద్రి మరియు గ్యాస్ సుమతి ఉపాధ్యాయురాలు కుమార్తె డాక్టర్, యస్.చందనప్రియ శేషాద్రి యం .బీ. బీ ఎస్ బంగ్లాదేశ్ లో గత 7 సంవత్సరాలు అక్కడే ఇంటెన్సిప్ పూర్తి చేసి 85% మార్కులతో పాస్ అయి బంగ్లాదేశ్ డాక యూనివర్సిటీ లో రెండవ ర్యాంక్ సాధించి, ఇండియాలో ఎంసీఐ పాస్ ఐనది. మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్టీఆర్ యూనివర్సిటీ లో మెంబర్షిప్ తీసుకొని గుర్తింపు పొందినది. 85% మార్క్స్ సాధించి మన రాష్ట్రంలో మెరిట్ లిస్టులో 122 నంబర్లో నిలిచి చిత్తూరు జిల్లాలోని పలమనేరు ప్రభుత్వ వైద్యశాలయందు సివిల్ అసిస్టెంట్ సర్జన్ గా మెరిట్ లిస్ట్ లో విజయవాడ ఎన్టీఆర్ యూనివర్సిటీ లో జరిగిన కౌన్సిలింగ్ లో సివిల్ అసిస్టెంట్ పోస్ట్ సాధించడం జరిగింది,శుక్రవారం పలమనేరు కాకతోపూ అర్బన్ హెల్త్ సెంటర్ నందు జాయిన్ కావడం జరిగింది. ఈ కార్యక్రమానికి శేషాద్రి కుటుంబ సభ్యులు, టీచర్స్,ఆశా వర్కర్లు, ఆసుపత్రి సిబ్బంది హాజరై డాక్టర్ చందనప్రియ కు బొకే మరియు శాలువాతో సన్మానించడం జరిగింది. డాక్టర్ చంనప్రియ మాట్లాడుతూ మా తల్లి తండ్రుల వలన నేను ఈరోజు డాక్టరుగా రావడం జరిగిందని మా నాన్న శేషాద్రి లాగ నేను కూడా ప్రజలకు సేవలు అందిస్తాను అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు

# యాదవులకు అండగా ఉంటాం.



## – భారత యాదవ సమితి రాష్ట్ర అధ్యక్షులు దాసరి నాగేష్ యాదవ్.

స్వర్ణ సాగరం డోర్నకల్,మే 09

యాదవులకి నిత్యం అండగా ఉంటామని భారత యాదవ సమితి రాష్ట్ర అధ్యక్షులు దాసరి నాగేష్ యాదవ్ అన్నారు. శుక్రవారం డోర్నకల్ యాదవ నగర్ కి చెందినా ఎల్లబోయిన యాకేష్ యాదవ్ అనారోగ్యంతో బాధపడుతూ ఈటీవాలే హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయిన యాకేష్ యాదవ్ ను పరామర్శించి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు.అదేవిధంగా అతని జన్మదిన సందర్భంగా ఆకాంక్షించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన భారత యాదవ సమితి రాష్ట్ర అధ్యక్షులు దాసరి నాగేష్ యాదవ్.ఈ కార్యక్రమంలో భారత యాదవ సమితి జిల్లా యూత్ కన్వీనర్ దాసరి నాని యాదవ్,యాదవ నాయకులు ఎల్లవుల హరికృష్ణ యాదవ్, జక్కుల సురేష్ యాదవ్,పండగ ఉపేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో మేటి

## కెనరా బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ సాయి భరత్

తోటపల్లి గూడూరు స్వర్ణసాగరం మే 9





మండలంలోని కోదూరు కెనరా బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ విసాయి భరత్

గత మూడు సంవత్సరాలు విధులు నిర్వహి ంచిఖాతాదారులఅభిమానాన్ని పొందారు తమ తమ పనుల నిమిత్తం వచ్చే ఖాతాదారుల సమర్యాద పూర్వకంగా పలకరిస్తూ వారి పనులను ఇబ్బంది లేకుండా చక్కగా చేసి పెట్టడం ఆయననైజంగా ఖాతాదారులు పేర్కొంటున్నారుఖాతాదారుల మనసును నొప్పించకపోవడం క్లిష్ట సమస్యలను అందరితో చర్చించి సామరస్యంగా పరిష్కరించడంలో ఆయన సేవలను ఖాతాదారులు కొనియాడుతున్నారుఆయన బదిలీ సందర్భంగా జరిగిన అభినందన సమావేశంలో సాయి భరత్ సేవలనుప్రశంసించడంఆయన నిజాయితీకి నిస్వార్థ సేవకు ప్రతీకగా చెప్పవచ్చు

# పట్టణ విద్యాభిమానులకు శుభవార్త

మడకశిర స్వర్ణ సాగరం మే 09

పదవ తరగతిలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు మేడ్స్ ఎన్జీవో ఆధ్వర్యంలో నిర్వహించే స్కాలర్షిప్ టెస్ట్ కి హాజరై అత్యున్నత ప్రతిభ కనబరిచిన 100 మంది విద్యార్థులకు ఉచిత విద్య అవకాశాలు కల్పించబడును అని కార్యదర్శి ప్రకాష్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఈనెల 11 వ తారీకు ఆదివారం ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 1:00 వరకు పరీక్ష నిర్వహించును. ఈ పరీక్ష కేంద్రం మడకశిర సర్వోదయ జూనియర్ కళాశాల క్యాంపస్ నందు నిర్వహించబడును. కావున ఈ సదా అవకాశాన్ని పదవ తరగతిలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు అందరూ వినియోగించుకోగలరని సంస్థ నిర్వాహకులు తెలియజేశారు. మరిన్ని వివరాలకు సంప్రదించండి సెల్ నెంబర్ 8019278756, 9959772198, 8919051679, 9441381867, 9121350064

# ఆపరేషన్ సింధూర నేపథ్యంలో కాణిపాకం ఆలయం వద్ద కట్టుదిట్టమైన తనిఖీలు



కాణిపాకం మే 8 స్వర్ణ సాగరం

ఆపరేషన్ సింధూర నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు చిత్తూరు జిల్లా పోలీస్ శాఖ స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి కాణిపాకం ఆలయంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం ఆలయం వద్ద ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.దుకాణదారులకు భక్తులకు హెచ్చరికలు చేశారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎవరైనా బయట వ్యక్తులు అనుమానస్పదంతో తిరుగుతూ ఉంటే వెంటనే పోలీసులకుతెలియజేయాలన్నారు.ఆలయానికి దర్శనానికి వచ్చే ప్రతి భక్తున్ని పరిశీలించి పంపించాలన్నారు.ఆలయ సిబ్బంది సెక్యూరిటీ ప్రతి ఒక్కరు పోలీస్ శాఖ జారీ చేసిన నియమ నిబంధనలు పాటించాలన్నారు. పోలీసు జాగిలాలతో ఆలయం పరిసర ప్రాంతాల్లో పరిశీలించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఏ ఆర్ నందకిషోర్. ఏ ఆర్ డి.ఎస్.పి. చిన్ని కృష్ణ ఎస్సైలు చంద్రశేఖర్.ధరణిదర్. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# మావోయిస్టు దాడిలో మృతిచెందిన నూకతోటి పవన్ కళ్యాణ్ కు ఘనంగా అంత్యమక్రియలు



కనిగిరి స్వర్ణ సాగరం మే 09

తెలంగాణ చత్తీస్ ఘడ్ సరిహద్దుల్లో జరిగిన మావోయిస్టు దాడిలో గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ నూక తోటి పవన్ కళ్యాణ్ మరణించడం శోకసముద్రంగా మారిందని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శుక్రవారం పీసీ పల్లి మండలం ముద్దపాడులో ప్రభుత్వా లాంచనాలతో అంతిమ వీడ్కోలు ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కనిగిరి డి.ఎస్.పి సాయి ఈశ్వర్ యశ్వంత్ సిఐలు ఖాజావలి భీమానాయక్ ఎస్సైలు ఎస్సైలు కోటయ్య శ్రీరామ్ మాధవ్ రావు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వందేమాతరం అని నినదించండి

## -బిసి విభాగం, తెలుగుదేశం పార్టీ

స్వర్ణ సాగరం -శ్రీకాళహస్తి.

భారతదేశ సమగ్రతను దెబ్బతీయాలని చూస్తున్న పొరుగు దేశమైన పాకిస్తాన్ కుట్రలను అడ్డుకోవడానికి మనందరం కలిసికట్టుగా భారత ప్రభుత్వానికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని, అందులో భాగంగానే ప్రతీ ఒక్క భారతీయుడు వందేమాతరమంటూ నినదించాలని తెలుగుదేశం పార్టీ నాయకులు పిలుపునిచ్చారు.అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు వెళుతున్న భారతదేశాన్ని చూసి ఓర్వలేని పాకిస్తాన్ తన కుట్రపూరితమైన వైఖరితో తీవ్రవాదాన్ని పెంచి పోషిస్తూ, ముష్కర మూకలను మన దేశంలోకి జొప్పించి అస్థిర పరచాలన్న కుట్రను భగ్నం చేయడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రతీ చర్యకు యావత్ భారతదేశం అండగా నిలబడాలని పిలుపునిచ్చారు.పాకిస్తాన్ ప్రోద్బలంతో దేశంలోకి జొరబడాలని చూస్తున్న తీవ్రవాదులను, వారికి మద్దతుగా నిలుస్తున్న పాకిస్థాన్ సేనలను అడ్డుకోవడానికి తనవంతుగా సేవలందించడానికి ముందుకు వచ్చిన శ్రీ సత్యసాయి జిల్లా, పెనుకొండ శాసనసభ నియోజకవర్గం, గోరంట్ల మండలానికి చెందిన మురళి నాయక్ అనే సైనికుడు ప్రాణాలు కోల్పోవడం విషాదకరం అని, దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుడు మురళి నాయక్ కు ఈరోజు స్థానిక పూసల వీధి కూడలిలో



ఆయన చిత్రపటాన్ని ఉంచి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు డా.జి.దశరధాచారి, రెడ్డివారి గురవారెడ్డి, మిన్నల్ రవి, గాలి మురళి నాయుడు, రావిళ్ళ మునిరాజా నాయుడు, డా.నివేదిత మోరె, నాగమల్లి దుర్గాప్రసాద్, డా.యం.ఉమేష్ రావు, పేట బాలాజీ రెడ్డి, కాసరం రమేష్, వజ్రం కిషోర్, దొరైరాజ్ రెడ్డి, మునిరాజా యాదవ్, డి.వి.నారాయణ, కోట చంద్రశేఖర్, కె.వి.ప్రతాప్, మురళి, షేక్ మహబూబ్ బాషా, చాంద్ బాషా, యం.యస్.రెడ్డి, నాగరాజు, భాస్కర్, మణికంఠ, ఆనంద్ గౌడ్, రమేష్, సతీష్, కిరణ్, వినోద్, వెంకటస్వామి, సురేష్, లోకేష్, నూర్ మొహమ్మద్, చాంద్ బాషా, ముజీబ్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# భారత సైన్యానికి సెల్యూట్...తలపా దామోదరం రెడ్డి

స్వర్ణ సాగరం -శ్రీకాళహస్తి

పహల్గాం ఉగ్రదాడి తరువాత పాకిస్తాన్ ఉగ్ర స్థావరాలపై జరుగుతున్నటువంటి సింధూర్ ప్రతిఘటన చర్యల్లో భారతదేశ సైనిక త్రివిధ దళాలు క్షేమంగా విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ రేణిగుంట మండలం వెదల్లచెరువు ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు.తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్తాన్ ఉగ్రముకలపై విరోచితంగా పోరాడుతున్నటువంటి భారతదేశ సైనిక దళాలు విజయం సాధించాలని, అదేవిధంగా తీవ్రవాదుల ఉనికి మానవ మునుగడుకు ముప్పని అటువంటి వారి పట్ల భారతదేశ ప్రభుత్వ చర్యలు గర్వించదగ్గ విషయమనిఇటువంటి సమయంలో భారతదేశంలో ప్రతి ఒక్కరూ ఏకమై భారత దేశం యొక్క ఐక్యతను చాటాల ని తెలిపారు.ఈ కార్యక్రమంలో రేణిగుంట మండల అధ్యక్షులు చెరుకు తోట రాహుల్, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేందర్ రెడ్డి, రవి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు



# కృషి ఉంటే మనుషులు ఋషులు అవుతారు, మహాపురుషులవుతారు

## . దీనికి నిదర్శనం ప్రతీక్ష

## జి. బాబు మోహన్ దాస్,

మే 9,

నీ కోరిక బలమైనదైతే అది తప్పకుండా నెరవేరుతుందని మన పెద్దలు తరచుగా చెబుతుంటారు.ధృడ సంకల్పం, మొక్కవోని ఆత్మవిశ్వాసం, నిరంతర శ్రమ ఉంటే ఎలాంటి అసాధ్యాలను కూడా సుసాధ్యం చేయవచ్చని ఎంతోమంది నిరూపించారు.అలాంటివాళ్లలో ప్రతీక్ష తోండ్వాల్కర్ ఒకరు. ఒకప్పుడు ఎస్బీఐ బ్యాంకులో స్వీపర్ గా తుడుస్తూ టాయిలెట్లు కడుగుతూ ఉండే ప్రతీక్ష నేడు అదే ఎస్బీఐ బ్యాంకులో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ గా ఎదిగింది. జస్ట్ ఒక స్వీపర్ ఈ స్థాయికి రావడం అంటే చిన్న విషయం కాదు..దీని వెనుక ఎన్నో నిద్రలేని రాత్రులను ఆమె గడిపింది. తన కష్టాన్ని,పట్టుదలని నమ్ముకొని అసాధ్యం కానిదేదీ లేదు అంటూ అందరికీ స్ఫూర్తినిస్తుంది.మహారాష్ట్రకు చెందిన ప్రతీక్ష తోండ్వాల్కర్ ఓ పేద కుటుంబంలోజన్మించారు.ఇంట్లోని ఆర్థిక ఇబ్బందుల కారణంగా 17 ఏళ్ల వయస్సులో 10వ తరగతి అప్పుడు సదాశివ్ అనే వ్యక్తితో చదువుతుండగానే ఆమెకు పెళ్లి చేశారు. దీంతో ప్రతీక్ష చదువు మానేయాల్సి వచ్చింది.సదాశివ్..ముంబైలోని ఓ ఎస్బీఐ బ్యాంకులో బుక్ బైండర్ గా పనిచేసేవాడు. జీవితం ప్రశాంతంగా సాగుతోందనుకున్న సమయంలో ఓ విషాధం నెలకొంది. ప్రతీక్ష భర్త సదాశివ్ ఓ యాక్సిడెంట్ లో చనిపోయాడు. అప్పటికి ప్రతీక్షకు కేవలం 20 ఏళ్ల వయస్సు మాత్రమే. ఓ కొడుకు కూడా ఉన్నాడు. చిన్న వయసులోనే వైధవ్యం, ఒడిలో పసిబిడ్డతో ఒంటరిగా మిగిలిపోయిన ప్రతీక్షకు జీవితం అంధకారంగా తోచింది. భవిష్యత్తుపై బెంగ, బిడ్డను ఎలా పోషించాలన్న ఆందోళన ఆమెను చుట్టుముట్టాయి.పసిబిడ్డను పోషించుకోవడానికి తన కాళ్లపై తాను నిలబడటానికి ఏదో ఒక పని చేయాల్సిన పరిస్థితి. పూర్తిస్థాయి విద్యార్హతలు లేకపోవడంతో మంచి ఉద్యోగం దొరకడం గగనమైంది. చివరికి తన భర్త పనిచేసిన యస్ బి ఐ బ్యాంకులోనే నెలకు 60-65 రూపాయల జీతానికి స్వీపర్ గా చేరింది. టాయిలెట్లు క్లీన్ చేయడం, ఫర్నీచర్ తుడవడం ఆమె దినచర్య. ఈ కొద్దిపాటి సంపాదనతోనే ఇంటిని నెట్టుకురావడం, కొడుకు బాగోగులు చూడటం, బాధ్యతలన్నీ ఒంటరిగానే మోసింది. ఎన్ని కష్టాలు ఎదురైనా ఆమె నిరాశ చెందలేదు,వెనుకడుగు వేయలేదు. తన కుమారుడికి బంగారు భవిష్యత్తును అందించాలన్న తపన ఆమెలో బలంగా ఉండేది. ఓటమిని అంగీకరించే ప్రసక్తే లేదు అనుకున్న ప్రతీక్ష.. తన చదువును కొనసాగించాలని నిశ్చయించుకుంది.కష్టాల కన్నీళ్లను దిగమింగుకుంటూనే చదువుకోవాలని కోరికను కూడా పెంచుకుంది. తన జీవితాన్ని, తన కొడుకు భవిష్యత్తునుమార్చుకోవాలంటే ఇప్పుడు చదువు ఒక్కటే తనముందు ఉన్న మార్గమని ఆమె బలంగా నమ్మింది.



పగలంతా బ్యాంకులో స్వీపర్ గా పని చేసి అలసిపోయి ఇంటికి వచ్చిన ఆ తర్వాత ముంబైలోని విఖ్రోలిలో ఉన్న నైట్ కాలేజీకి వెళ్లి తన చదువును కొనసాగించింది. మొక్కవోని పట్టుదలతో ఇంటర్మీడియట్ పూర్తిచేసింది. ఆ తర్వాత తన జీవితాన్ని,వృత్తిని మార్చుకోవాలనే దృఢ సంకల్పంతో సైకాలజీలో డిగ్రీ కూడా సాధించింది. ఓ వైపు ఇంటి బాధ్యతలు, మరోవైపు బ్యాంకులో పని ఇంకోవైపు చదువు ఈ మూడింటినీ సమన్వయం చేసుకుంటూ ఆమె పడిన శ్రమ వర్ణనాతీతం. ఆమె అంకితభావం, కష్టపడే తత్వం యస్ బి ఐ అధికారుల దృష్టిని ఆకర్షించాయి.చదువు పూర్తికావడంతో స్వీపర్గా పనిచేస్తున్న ప్రతీక్ష కి అదే బ్యాంకులో క్లర్క్గా ప్రమోషన్ లభించింది. ఇది ఆమె జీవితంలో ఒక ముఖ్యమైన మలుపు. ఒకప్పుడు తాను శుభ్రం చేసిన చోటే క్లర్క్గా కూర్చోవడం ఆమె ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది.స్వీపర్ గా పనిచేసిన అదే బ్యాంకులో క్లర్క్ గా కూర్చోవడం ఆమెకు ఎంతో గర్వంగా అనిపించింది. ఈ విజయం ఆమెలో మరింత ఆత్మవిశ్వాసాన్ని నింపింది. 1993లో ప్రతీక్ష జీవితంలో మరో వసంతం వికసించింది. 1993లో ప్రమోద్ తోండ్వాల్కర్ అనే వ్యక్తితో ప్రతీక్షకు రెండో పెళ్లి జరిగింది. ప్రమోద్ తోండ్వాల్కర్ కూడా ప్రతీక్ష ఆశయాలకు అండగా నిలిచారు. నువ్వు ఏది సాధించాలనుకుంటావో సాధించు నీ వెనుక నేనున్నా అంటూ భార్యను ప్రోత్సహించాడు. తన భార్యకు ఇష్టమైన బ్యాంకింగ్ వృత్తిలో ఆమె ఉన్నత స్థానానికి చేరుకోవాలని బ్యాంకింగ్ పరీక్షలకు సిద్ధం కావడానికి ప్రోత్సహించారు. రెండవ భర్త ప్రమోద్ తొండ్వాల్కర్ అందించిన అండదండలు ఆమె విజయానికి మరింత బలాన్నిచ్చాయి.భర్త ప్రోత్సాహం, తనలోని అకుంఠిత దీక్షతో ప్రతీక్ష బ్యాంకింగ్ పరీక్షలకు సన్నద్ధమయ్యారు. పగలంతా బ్యాంకు పని, ఇంటి బాధ్యతలు నిర్వర్తిస్తూనే రాత్రిళ్లు మేల్కొని చదివేది. ఎన్నో నిద్రలేని రాత్రులు, అంతులేని శ్రమ ఆమెను విజయానికి మరింత దగ్గర చేశాయి. ఆమె అవిశ్రాంత కృషి ఫలితంగా ప్రతీక్ష ట్రైనీ ఆఫీసర్గా ఎంపికైంది. ఇది ఆమె వృత్తి జీవితంలో మరో మైలురాయి. అక్కడితో ఆమె ప్రస్థానం ఆగలేదు. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రతి సవాలునూ ధైర్యంగా ఎదుర్కొంటూ అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చింది. పనిపట్ల ఆమెకున్న నిబద్ధత, సహోద్యోగులతో ఆమె ప్రవర్తించే తీరు, సమస్యలను పరిష్కరించడంలో ఆమెకున్న నైపుణ్యం ఆమెను ఉన్నత శిఖరాలకు చేర్చాయి.ట్రైనీ ఆఫీసర్ స్థాయి నుండి స్కేల్ %×%, స్కేల్ %××%, స్కేల్ %×××%, స్కేల్ %×ఎ%, చీఫ్ మేనేజర్... ఇలా ఒక్కో మెట్టూ ఎక్కుతూ, చివరకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (ఏజియం) అనే అత్యున్నత పదవిని అలంకరించారు. ఒకప్పుడు అదే బ్యాంకు ఆవరణలో చీపురు పట్టిన చేతులతో నేడు వేలాది మంది ఉద్యోగులను నిర్దేశించే స్థాయికి ఎదగడం ప్రతీక్ష అసాధారణ ప్రతిభకు, మొక్కవోని ధైర్యానికి నిదర్శనం. కుటుంబ సహకారం, వ్యక్తిగత కృషి కలిస్తే అసాధ్యాలను కూడా సుసాధ్యం చేయవచ్చనడానికి ప్రతీక్ష జీవితమే ఒక ఉదాహరణ.ప్రతీక్ష తోండ్వాల్కర్ జీవితం కేవలం ఒక విజయగాథ మాత్రమే కాదు..ధైర్యం, కఠోర శ్రమ, ఆత్మవిశ్వాసం ఉంటే ఎలాంటి ప్రతికూల పరిస్థితులనైనా అధిగమించవచ్చని ఆమె నిరూపించారు. కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు, మహా పురుషులవుతారు అనే నానుడికి సజీవ సాక్ష్యం. బాల్య వివాహం, పేదరికం, భర్త మరణం, ఒంటరితనం, విద్యాభ్యాసానికి ఆటంకాలు ఇలాంటి ఎన్నో సవాళ్లను ఎదుర్కొని, వాటిని విజయానికి సోపానాలుగా మార్చుకున్న ఆమె ప్రస్థానం నేటి యువతకు, ముఖ్యంగా మహిళలకు ఆమె జీవితం ఒక గొప్ప ఆదర్శం. పరిస్థితులు మన చేతుల్లో లేకపోయినా, మన భవిష్యత్తును మనమే నిర్మించుకోవచ్చనే నమ్మకాన్ని ఆమె జీవితం మనకు తెలియజేస్తుంది.

# కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్

## ఈ టోర్నమెంట్ ను ప్రారంభించిన వీరులపాడు మండల పార్టీ అధ్యక్షుడు కొండ్రగుంట శ్రీనివాసరావు

## ఈ టోర్నమెంట్ లో తలపడనున్న 20 జట్లు

మచిలీపట్నం,, 9 మే 2025 :

గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది ప్రతిభ గల క్రీడాకారులు వున్నారు. వారిని వెలుగులోకి తీసుకువచ్చి క్రీడావకాశాలు పెంపొందించేందుకు కేశినేని ఫౌండేషన్ ద్వారా ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) వీరులపాడు మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేయటం జరిగిందని వీరుల పాడు మండల పార్టీ అధ్యక్షుడు కొండ్రగుంట శ్రీనివాసరావు తెలిపారు. వీరులపాడు మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం జమ్మవరం గ్రామంలో జిల్లా పరిషత్ స్కూల్ గ్రౌండ్ నందు ప్రారంభమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీరులపాడు మండలం అధ్యక్షుడు కొండ్రగుంట శ్రీనివాసరావు ఈ టోర్నమెంట్ ను ప్రారంభించారు. అనంతరం కొండ్రగుంట శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల పరిపూర్ణ వికాసం ప్రతిష్టాత్మకంగా ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) నిర్వహిస్తున్న"వికసిత్ పంచాయతీ" కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో క్రీడలను ప్రోత్సహించేందుకు కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ వారి పర్యవేక్షణలో నందిగామ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య సహకారంతో ఈ క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. మే 9,10,11 వ తేదీల్లో జరిగే లీగ్ మ్యాచుల్లో తలపడేందుకు 20 జట్లు తలపడనున్నట్లు తెలిపారు.. లీగ్ మ్యాచుల అనంతరం సెమీఫైనల్ ఫైనల్ మ్యాచ్ కూడా జరుగుతాయని. విజేతలకు ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య టోర్నమెంట్ కప్ తో పాటు నగదు బహుమతులు అందజేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పంచాయతీ ఛాంపియన్స్ యర్రంరెడ్డి ప్రదీప్ కుమార్ ,కట్ట సునీల్, సింగి సురేష్, కొప్పుల రాము, ఆవుల దొడ్డి హనుమంతరావు,కారం శ్రీనివాసరావు లతో పాటు జమ్మవరం,బోడవాడ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# జవాన్ మురళి నాయక్ కు ఘన నివాళి



స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి

పాకిస్తాన్ తో జరుగుతున్న యుద్ధంలో వీరోచితంగా పోరాడి వీరమరణం పొందిన తిరుపతి జిల్లాలో పద్మావతి పార్కులో ఆర్మీ జవాన్ ఎం మురళి నాయక్ చిత్రపటానికి ఏఐఎస్ఎఫ్ ఏ వై ఎస్ ఎఫ్ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు.అఖిల భారత విద్యార్థి సమాఖ్య ( ఏఐఎస్ఎఫ్) అఖిల భారత యువజన సమాఖ్య ( ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం వారి కార్యాలయంలో దేశం కోసం వీర మరణం పొందిన మురళి నాయక్ కు జోహార్లు అర్పిస్తూ సంతాపాన్ని తెలియజేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కత్తి రవి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఉదయ్ కుమార్ ప్రవీణ్ కుమార్ డాక్టర్ బలరాం ఓం రాజ్ మోహన్ విష్ణు సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

# 2.0 చూపిస్తాం





స్వర్ణ సాగరం-శ్రీకాళహస్తి

తాము అధికారంలోకి వస్తే మమ్మల్ని ఇబ్బందులు పెట్టిన అధికారులకు, నాయకులకు 2.0 చూపిస్తామని శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి హెచ్చరించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో తొట్టంబేడు మండల కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తుందని మండిపడ్డారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా అక్రమ కేసులు బనాయిస్తోందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు పోలీసులు, పలు శాఖల అధికారులు సహకరిస్తున్నారని వాపోయారు. వైసిపి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రాగానే వేధింపులకు పాల్పడ్డ వారికి తగిన శాసి చేస్తామని స్పష్టం చేశారు. వైసిపి జిల్లా కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు, మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, అల్లెయ్య, మణి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ముక్కంటి సేవలో ప్రముఖులు



స్వర్ణ సాగరం-శ్రీకాళహస్తి

స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయానికి శుక్రవారం పలువురు ప్రముఖులు విచ్చేశారు. రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కర్నూల్ జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా కుటుంబ సమేతంగా స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు సంప్రదాయ స్వాగతం పలికారు. దర్శనానంతరం స్వామి అమ్మవార్ల జ్ఞాపికలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# కనిగిరిలో వాహనాలు తనిఖీ చేసిన డీఎస్పీ

కనిగిరి స్వర్ణ సాగరం మే 09



పాకిస్థాన్ పై భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన నేపథ్యంలో అనుమానిత వ్యక్తుల కదలికపై నిఘా పెంచామని కనిగిరి డీస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ తెలిపారు.శుక్రవారం కనిగిరిలోని చెక్ పోస్ట్ వద్ద డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీస్ లు తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ మాట్లాడు తూ ప్రస్తుత పరిస్థితులు దృష్ట్యా కొన్ని రోజులు పాటు ఈ తనిఖీలు జరుగుతాయని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో హనుమంతుని పాడు ఎస్సై మాధవ రావు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## రౌడీ హీరో బర్త్ డే స్పెషల్..
## వీడి14 ఫస్ట్ లుక్ రిలీజ్

టాలీవుడ్ అగ్ర కథానాయకుడు విజయ్ దేవరకొండ నేడు తన 36న పుట్టినరోజుని జరుపుకుంటున్నారు. ఇక విజయ్ బర్త్‌డే కానుకగా ఆయన నటిస్తున్న సినిమాల్లో నుంచి అప్‌డేట్స్ వస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే కింగ్‌డమ్ నుంచి కొత్త పోస్టర్ విడుదల కాగా.. తాజాగా తన నెక్స్ట్ ప్రాజెక్ట్ వీడి14కి సంబంధించి బర్త్‌డే విషెస్ తెలుపుతూ కొత్త పోస్టర్‌ను పంచుకుంది చిత్రయూనిట్. అయితే ఈ పోస్టర్‌లో విజయ్ ముఖాన్ని చూపించలేదు. ఒక దేవుడి విగ్రహం ముందు విజయ్ ధ్యానం చేస్తున్నట్లుగా ఉంది. కేవలం వీపు భాగాన్ని మాత్రమే చూపించారు. ఈ పోస్టర్‌లో విజయ్ కండల తిరిగిన శరీరంతో ఆకట్టుకుంటున్నాడు. దీంతో ఈ పోస్టర్ క్షణాల్లో వైరల్ అవ్వగా, అభిమానులు సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. శ్యామ్ సింగరాయ్ దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించబోతుంది. పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో రాయలసీమ నేపథ్యంలో 1854 – 1878 మధ్య కాలంలో జరిగే ఆసక్తికర కథాంశంతో రూపొందనుంది. దీంట్లో విజయ్ ఓ యోధుడి పాత్రలో కనిపించనున్నట్లు చిత్ర వర్గాలు ఇప్పటికే ప్రకటించాయి. ఈ సినిమాలో రష్మిక కథానాయికగా నటించబోతున్నట్లు సమాచారం.

నాని-సుజీత్ మూవీకి లైన్ క్లియర్..

## టైటిల్ కూడా ఫిక్స్ అయినట్టేనా?



నేచురల్ స్టార్ నాని వరుస సక్సెస్‌లతో దూసుకుపోతున్నాడు. ఆయన నిర్మాతగా వ్యవహరించిన కోర్టు చిత్రం మంచి విజయం సాధించింది. ఇక నటుడిగా హిట్ 3తో పెద్ద సక్సెస్ సాధించాడు. ఇక ఇప్పుడు ది ప్యారడైజ్ అనే చిత్రం చేస్తున్నాడు. ఈ మూవీతోను పెద్ద హిట్ కొడతాడని భావిస్తున్నారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్ పై అభిమానులు భారీ అంచనాలు అయితే ఉన్నాయి. రియలిస్టిక్ డ్రామాగా ఈ మూవీతో సరికొత్త చరిత్ర సృష్టిస్తాడని అంటున్నారు. అయితే లైనప్ చాల పెద్దగానే ఉన్నట్టు తెలుస్తుంది. నానికి చాలా కాలం క్రితమే సుజీత్ దర్శకత్వంలో ఓ సినిమా చేయాల్సి ఉంది. అయితే సుజిత్.. పవన్ కళ్యాణ్‌తో ఓజీ చేస్తుండగా , ఈ ప్రాజెక్ట్ చాన్నాళ్లుగా పెండింగ్‌లో ఉంది. రాజకీయాల్లో పవన్ బిజీగా ఉండటంతో మధ్యలో షూటింగ్ నిలిచినా, రీసెంట్ గా ఆయన డేట్స్ ఇచ్చి మరల సెట్స్ పైకి వచ్చారు. ఓజీ వచ్చే ఆగస్టు–సెప్టెంబర్ లో విడుదల కానుందని తెలుస్తుంది. ఆ తర్వాత సుజీత్ పూర్తి స్థాయిలో నాని ప్రాజెక్ట్ పై ఫోకస్ చేయనున్నాడు. దసరా తర్వాత ప్రీ ప్రొడక్షన్ పనులు ప్రారంభమవు తాయని, వచ్చే ఏడాది ప్రారంభంలో షూటింగ్ మొదలవుతుందని టాక్ వినిపిస్తోంది. నాని రీసెంట్‌గా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ సినిమా 2027లో రిలీజ్ అవుతుందని చెప్పడం మనం చూశాం. ఈ ప్రాజెక్ట్ కు బ్లడీ రోమియో అనే టైటిల్ ను ఫిక్స్ చేశారని ఇప్పటికే ఫిల్మ్ నగర్ లో గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన చేస్తారని సమాచారం. ఇక ఇదిలా ఉంటే నాని హీరోగా శైలేష్ కొలను దర్శకత్వం వహించిన హిట్ సినిమాతో ఇప్పటికే రూ.100 కోట్ల వసూళ్లను రాబట్టారు నాని. ఇప్పుడు ప్యారడైజ్ మూవీ సెట్స్ లోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమా భారీ హిట్ అవుతుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.




## 'కింగ్డమ్'కి పోటీగా మనోజ్ మినీ మల్టీస్టారర్

కొన్నిరోజుల క్రితం మంచు ఫ్యామిలీలో గొడవలు జరిగాయి. ప్రస్తుతం అంతా సైలెంట్ గా ఉన్నారు. ?అయితే వివాదం నడుస్తున్న టైంలో కన్నప్ప గురించి మనోజ్ ఆసక్తికర కామెంట్స్ చేశాడు. తన సినిమాకు భయపడే విష్ణు 'కన్నప్ప' వాయిదా వేశాడని చెప్పుకొచ్చాడు. అసలు విషయానికొస్తే.. ఏప్రిల్ 25న వస్తుందనుకున్న కన్నప్ప సినిమాని జూన్ 27కి వాయిదా వేశారు. ఇదే టైంలో మంచు మనోజ్ 'భైరవం' కూడా చాలారోజులుగా వాయిదా పడుతూ వస్తోంది. లెక్క ప్రకారం గత డిసెంబరులోనే రిలీజ్ ప్లాన్ చేశారు. మరి ఓటీటీ డీల్ కుదరకపోవడమే, మరేదైనా కారణాలు తెలియదు గానీ రిలీజ్ లేటు చేస్తూ వచ్చారు. ఫైనల్ గా ఇప్పుడు కొత్త విడుదల తేదీని ప్రకటించారు. మే 30న థియేటర్లలోకి వస్తామని పోస్టర్ రిలీజ్ చేశారు. అంటే మనోజ్ ఆశపడ్డట్లు ఈసారి అన్న విష్ణు 'కన్నప్ప'తో పోటీ పెట్టుకోలేదు. అదే టైంలో విజయ్ దేవరకొండ 'కింగ్డమ్'కి పోటీగా బరిలో నిలిచారు. మంచు మనోజ్, బెల్లంకొండ శ్రీనివాస్, నారా రోహిత్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ మినీ మల్టీస్టారర్ కి విజయ్ కనకమేడల దర్శకుడు.

## భారత్-పాక్ మధ్య ఉద్రిక్తత.. అప్రమత్తంగా ఉండాలని రాజమౌళి విజ్ఞప్తి



భారత్ – పాకిస్తాన్ దేశల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో, ప్రముఖ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, భారత సైన్యానికి తన మద్దతును తెలియజేస్తూ దేశ ప్రజలకు ఒక ముఖ్యమైన సందేశాన్నిచ్చారు. దేశాన్ని ఉగ్రవాదం నుండి కాపాడుతున్న సాయుధ బలగాలను ఆయన ప్రశంసించారు. ఈ సున్నితమైన సమయంలో ప్రజలందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన కోరారు. "మన దేశాన్ని ఉగ్రవాదం నుండి కాపాడుతున్న ధైర్యవంతులైన మన భారతీయ సాయుధ బలగాలకు వందనం. వారి ధైర్యం స్ఫూర్తితో, శాంతి మరియు ఐక్యతతో కూడిన భవిష్యత్తును నిర్మించడానికి మనం ఒక దేశంగా కలిసి నిలబడదాం. మీరు భారత సైన్యం యొక్క కదలికలను చూసినట్లయితే, వారి ఫోటోలను లేదా వీడియోలను తీయవద్దు. వాటిని షేర్ చేయవద్దు. ఇలా చేయడం వలన మీరు శత్రువుకు సహాయం చేస్తున్న ప్రమాదం ఉంది. ధృవీకరించని వార్తలు లేదా పుకార్లను ఫార్వర్డ్ చేయడం ఆపండి. మీరు శబ్దం సృష్టించాలని శత్రువు కోరుకుంటున్నాడు. ప్రశాంతంగా, అప్రమత్తంగా, సానుకూలంగా ఉండండి. విజయం మనదే, అని రాజమైళి రాసుకోచ్చాడు. సినిమాల విషయానికొస్తే, రాజమౌళి ప్రస్తుతం మహేష్ బాబుతో కలిసి 'ఎస్ఎస్ఎంబీ29 అనే ప్రాజెక్ట్ చేస్తున్నాడు. ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్ పాత్రలో నటిస్తున్నట్లు సమాచారం. రచయిత విజయేంద్ర ప్రసాద్ కథను అందిస్తున్నాడు.



థగ్ లైఫ్' ఈవెంట్ వాయిదా..

## ఇది వేడుకల సమయం కాదు

కమల్ హాసన్ హీరోగా ప్రముఖ దర్శకుడు మణిరత్నం తెరకెక్కిస్తున్న చిత్రం 'థగ్ లైఫ్'. మే 16న ఈ సినిమా ఆడియో వేడుక చెన్నైలో జరగాల్సి ఉంది. అయితే, భారత్–పాకిస్థాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు కమల్ హాసన్ ప్రకటించారు. ఇలాంటి సమయంలో భారత పౌరలకు ఇబ్బంది కలిగించడం ఎంతమాత్రం కరెక్ట్ కాదని తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. 'ఆర్ట్ కెన్ వెయిట్.. ఇండియా కమ్స్ ఫస్ట్' అనే శీర్షికతో కమల్ హాసన్ ఒక ప్రకటన విడుదల చేశారు. 'మన దేశ సరిహద్దులో జరుగుతున్న పరిణామాలు, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా, మే 16న జరగాల్సిన 'థగ్ లైఫ్' ఆడియో విడుదలను వాయిదా వేస్తున్నాం. తిరిగి షెడ్యూల్ వివరాలను తెలుపుతాము. మన సైనికులు మన మాతృభూమి రక్షణలో అచంచలమైన ధైర్యంతో ముందు వరుసలో ఉండి పోరాటం చేస్తున్నారు. ఇది నిశ్శబ్ద సంఘీభావం కోసం నిర్ణయం తీసుకున్నాం. వేడుకలకు ఇదీ సరైన సమయం కాదని నేను నమ్ముతున్నాను. కొత్త తేదీని త్వరలో ప్రకటిస్తాం' అని ఆయన పంచుకున్నారు. 'నాయగన్' (1987) వంటి హిట్ మూవీ తర్వాత 38 సంవత్సరాలకు మళ్లీ కమల్ హాసన్– మణిరత్నం కాంబినేషన్‌లో 'థగ్ లైఫ్' సినిమా వస్తుంది. శింబు, త్రిష, అశోక్ సెల్వన్, ఐశ్వర్యా లక్ష్మి, జోజు జార్జ్, అభిరామి, నాజర్ ఇతర ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఉదయనిధి స్టాలిన్, ఆర్. మహేంద్రన్, శివ అనంత్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం జూన్ 5న విడుదల కానుంది. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతదర్శకుడిగా, రవి కె. చంద్రన్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.